# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం 5 డిసెంబర్ 2024

## తెలంగాణ ప్రాంతీయం

పేజీలు 12




# కౌశిక్ రెడ్డిపై పోలీస్ ఫిర్యాదు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోద్కెంది. బుధవారం మధ్యాహ్నం విధులను అడ్డగించి.. బెదిరించారని ఇన్స్‌పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కౌశిక్ రెడ్డితో పాటు మరో ఇరవై మందిపై కేసు నమోద్కెంది. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని కౌశిక్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన వచ్చే సమయానికి సీఐ బయటకు వెళు న్నారు. అయితే తన ఫిర్యాదును స్వీకరించిన తర్వాత వెళ్లాలని కౌశిక్ రెడ్డి పట్టుబట్టారు. అయితే తనకు అత్యవసర పని ఉందని, తిరిగి వచ్చాక ఫిర్యాదును స్వీకరిస్తానని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే విధులకు ఆటంకం కలిగించారని, తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని ఇన్స్‌పెక్టర్ తెలిపారు. సీఐ పని మీద వెళ్తుండగా ఆయన కారును బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకొని నినాదాలు చేశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సీఐ వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. దీంతో పోలీసులు ఫిర్యాదు చేశారు.



# పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా

### సాంకేతిక లోపం తలెత్తడంతో నిర్ణయం

**శ్రీహరికోట:** పీఎస్ఎల్వీ సీ59 ప్రయోగం వాయిదా పడిరది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇవాళ నింగికి ఎగరాల్సిన ప్రోబా3 స్పేస్‌క్రాఫ్ట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని రేపటికి వాయిదా వేస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.12 నిమిషాలకు ప్రయోగం ఉంటుందని ఇస్రో చెప్పింది. కృత్రిమ సూర్య గ్రహణాన్ని సృష్టించడం ద్వారా భానుడి గుట్టు విప్పేందుకు ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)కు చెందిన ప్రోబా-3 మిషన్ శాటిల్కెట్లను ఇస్రో నింగిలోకి పంపుతున్నది. నిజానికి ఇవాళ సాయంత్రం 4.06 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ సాంకేతిక లోపంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. ప్రోబా-3 మిషన్‌లో రెండు ఉపగ్రహాలు (కరోనాగ్రాఫ్ స్పేస్‌క్రాఫ్ట్, ఆక్యుల్టర్ స్పేస్‌క్రాఫ్ట్) ఉన్నాయి. మొత్తం దాదాపు 550 కిలోల బరువు ఉండే ఈ ఉపగ్రహాలను అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెడతారు. కృత్రిమ గ్రహణాన్ని సృష్టించడం ద్వారా సూర్యుడి బాహ్య వాతావరణమైన కరోనాను అధ్యయనం చేయడమే ప్రోబా-3 లక్ష్యం. ఆ రెండు ఉపగ్రహాలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ క్రమపద్ధతిలో భూకక్ష్యలో విహరించనున్నాయి.

### హామీల అమలుపై

# కాంగ్రెస్‌ను వెంటాడుతాం

- ఆడబిడ్డలకు నెలకు 2500 ఇవ్వాల్సిందే
- కృష్ణా నీటిని తరలించుకుపోతున్న ఏపీ
- చోద్యం చూస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు
- నాగార్జునసాగర్‌లో కేంద్ర బలగాలేంది?
- రేవంత్‌కు ధైర్యముంటే వెనక్కి పంపాలి
- సర్కారుపై కవిత విమర్శలు



**హైదరాబాద్:** అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నీ అమలు చేసేంతవరకు వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. ప్రభుత్వంలో జరిగే తప్పులను తెలంగాణ జాగృతి ఎప్పటికప్పుడు బయటపెడుతూనే ఉంటుందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన జాగృతి ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.


వివరాలు 9లో





# అమెరికా మిస్ జూనియర్‌గా మనహన్సిక

**బంజారాహిల్స్:** అమెరికాలో నిర్వహించిన అందాల పోటీల్లో తెలంగాణకు చెందిన బాలిక సత్తా చాటింది. 'నేషనల్ అమెరికన్ మిస్ జూనియర్ టీన్' టైటిల్‌ను సాధించి రాష్ట్రానికి వన్నె తెచ్చింది. మంగళవారం రాత్రి అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన నేషనల్ మిస్ అమెరికన్ పోటీ ల్లో తెలంగాణలోని వనపర్తికి చెందిన హన్సిక నసనల్లి (16) పాల్గొంది. అమెరికాలోని 50 రాష్ట్రాల నుంచి వచ్చిన 118 మంది బాలికలతో పోటీపడి మిస్ జూనియర్ టీన్ క్యాటగిరీలో విజేతగా నిలిచింది. అమెరికాలో స్థిరపడ్డ హన్సిక తండ్రి శేఖర్, భరతనాట్య కళాకారిణి అయిన తల్లి ప్రశాంతిని ప్రోత్సాహంతో హన్సిక పలు పోటీల్లో విజేతగా నిలిచింది.

## వృద్ధురాలికి కల్లు తాగించి ...
## మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన

**రామాయంపేట,** : మెదక్ జిల్లా రామాయంపేటలో ఓ వృద్ధురాలికి కల్లు తాగించి బంగారు, వెండి ఆభరణాలను కాజేసిన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించారు. రామాయంపేట సర్కిల్ పోలీసు స్టేషన్?లో సీఐ వెంకట్? రాజు గౌడ్ మీడియా సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడిరచారు. గత నెల (నవంబర్) 30వ తేదిన చెల్లాపూర్ గ్రామానికి చెందిన బండ్ల నర్సవ్వ అనే వృద్ధురాలికి మాయ మాటలు చెప్పి మద్యం కల్లు తాగించి ఆమె ఒంటిపై ఉన్న బంగారం, వెండి నగలతో పాటు రూ.30 వేల నగదును ఇద్దరు దంపతులు దొంగిలించారు. ఈ క్రమంలో బాధితురాలు నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు రామాయంపేట పోలీసులు తెలిపారు. ఖాజాపూర్ గ్రామానికి చెందిన ధరావత్ శీను, ఆయన భార్య ధరావత్ భూలీలను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. ఓ మధ్యవర్తి వద్ద తాకట్టు పెట్టిన ఒక జత బంగారం కమ్మలు, గుండ్లు, వెండి కడియాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అపరిచిత వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ఈ దొంగలను పట్టుకునే విషయంలో సహకరించిన ఆటో డ్రైవర్ మక్కల మహిపాల్?ను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజల గొంతుకై
## హరీశ్‌రావు ప్రశ్నిస్తే కేసులా?

**విత్‌డ్రా అయిన కేసును తిరగతోడిన ప్రభుత్వం**

**ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



**గజ్వేల్:** ప్రజల గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే మాజీమంత్రి హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టిస్తున్నరని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. హరీశ్‌పై కోపంతో చక్రధర్‌గౌడ్ ద్వారా ప్రభుత్వం కేసులు పెట్టిస్తున్నదని చెప్పారు. జూన్‌లో ఫిర్యాదు చేస్తే నవంబర్‌లో కేసు విత్‌డ్రా చేసుకున్నారని గుర్తుచేశారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ పూర్తి రుణమాఫీ చేయకుండా చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మాజీ జడ్పీటీసీ మల్లేశం, మండలాధ్యక్షులు మధు, నవాజ్‌మీరా, కౌన్సిలర్ చందు, కనకయ్య పాల్గొన్నారు.

## ఓఆర్ఆర్ పై నుంచి పడిన టిప్పర్
### డ్రైవర్ సజీవ దహనం
### గౌడవెల్లి పరిధిలో ఘటన

**మేడ్చల్** : చెత్త లోడుతో బాహ్య వలయ రహదారి మీదుగా వెళ్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు కిందపడి మంటలు చెలరేగడంతో డ్రైవర్ సజీవ దహనమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం జిల్లా ఇల్లెందుకు చెందిన పినబోయిన సందీప్(25) కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లిలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత అతడు మియాపూర్ నుంచి చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించేందుకు చెత్తను లోడ్ చేసిన టిప్పర్‌ను బాహ్య వలయ రహదారి మీదుగా తీసుకు వస్తున్నాడు.
మార్గమధ్యలో మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామ పరిధిలోకి రాగానే అండర్ పాస్ వద్ద ప్రమాదవశాత్తు టిప్పర్ బాహ్య వలయ రహదారి పైనుంచి కింద పడింది. ఆ వెంటనే టిప్పర్ వాహనానికి మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. 100 వాహనానికి సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అగ్ని మాపక యంత్రం సాయంతో టిప్పర్‌కు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. ఈ మంటల్లో డ్రైవర్ సందీప్ సజీవ దహనం అయ్యాడు. డ్రైవర్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో రెండు కొత్త బస్ డిపోలు ఏర్పాటు
## అనుమతులు మంజూరు చేసిన తెలంగాణ సర్కారు!

**హైదరాబాద్:** తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి రాష్ట్రంలో కొత్త బస్ డిపోలు ఏర్పాటు కాబోతున్నాయి. ఈ మేరకు రేవంత్ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ములుగు, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో కొత్త బస్ డిపోలు ఏర్పాటు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్డర్ కాపీలను త్వరలో స్థానిక ప్రజా ప్రతినిధులకు అందించనున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడిరచారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీకి మంచి రోజులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ లాభాల్లోకి అడుగు పెట్టిందని మంత్రి పొన్నం వెల్లడిరచారు. "దాదాపు ఆర్టీసీలో 10, 15 సంవత్సరాల తర్వాత రెండు కొత్త డిపోలను ఇస్తున్నాం. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రవాణాశాఖ మంత్రిగా నాకు చాలా సంతృప్తిని ఇస్తున్నది. గత 10, 15 సంవత్సరాలుగా నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని ఈ రోజు లాభాల బాటలోకి తీసుకుపోతున్నాం. తెలంగాణలో మరో రెండు ఆర్టీసీ కొత్త బస్సు డిపోలు మంజూరు చేస్తున్నాం. ఆర్టీసీలో నూతన ఉద్యోగ నియామకాలు, నూతన బస్సుల కొనుగోలు, పలు సంస్కరణలు ,కార్మికుల సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నం. ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రాలుగా ఉన్న పెద్దపల్లి ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంలో రెండు నూతన ఆర్టీసీ బస్సు డిపోలు ఏర్పాటు చేస్తున్నాం" అని పొన్నం వివరించారు. ములుగు, పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేసే బస్సు డిపోలకు సంబంధించి ఇప్పటికే ఆర్డర్లు జారీ అయినట్లు మంత్రి పొన్నం తెలిపారు. "కొత్త బస్ డిపోలకు సంబంధించిన ఆర్డర్ కాపీలను త్వరలోనే ఆయా జిల్లాల మంత్రులు అయిన సీతక్క, శ్రీధర్ బాబుకు అందిస్తాం. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ముందడుగు వేస్తుందనడానికి ఈ బస్సు డిపోలు నిదర్శనం. రెండు కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత ప్రయాణీకులకు ఎంతో మేలు కలగనుంది. ములుగు జిల్లా మూడు, నాలుగు జిల్లాలకు సరిహద్దు. సమ్మక్క సారలమ్మ కొలువైన ప్రాంతం. తొందరలోనే అక్కడ బస్సు డిపో నిర్మాణం చేపట్టి ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పెద్దపల్లి పారిశ్రామిక కేంద్రం. జిల్లా కేంద్రం చేసినప్పటికీ బస్సు డిపో లేదు. అక్కడి శాసనసభ్యుడు, మంత్రి శ్రీధర్ బాబు సూచన మేరకు ఈ బస్సును మంజూరు చేస్తున్నాం. ములుగు, పెద్దపల్లి జిల్లా ప్రజలకు రవాణాశాఖ మంత్రిగా నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని పొన్నం ప్రభాకర్ వెల్లడిరచారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులలో ఫ్రీగా ప్రయాణించేలా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి జీవం పోసినట్లు అయ్యింది. సర్కారు నిర్ణయంతో ఆర్టీసీకి మంచి ఆదాయం అందుతోంది.

# పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులు..

**భూ కేటాయింపులపై న్యాయస్థానంలో విచారణ**



**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలకు భూ కేటాయింపులపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పార్టీ కార్యాలయాలకు చౌకగా భూములు ఇచ్చారంటూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. హైదరాబాద్‌తోపాటు మిగతా జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం చౌకగా భూములు అమ్మకాలు దక్కించుకున్నారని పిటిషనర్ ప్రస్తావించారు. 500 కోట్లు విలువైన భూమిని కేవలం 5 కోట్లుకు కేటాయించారని వాదించారు. గజం 100 రూపాయలకే కేటాయింపు జరిగినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారులు, జర్నలిస్టులకు భూ కేటాయింపులపై గత నెల 25న ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పుని ఈ సందర్భంగా ప్రస్తావించారు. రెండేళ్లగా ఈ అంశంపై ప్రతివాది మాజీ సీఎం కేసీఆర్ కౌంటర్ దాఖలు చేయలేదని పేర్కొన్నారు. దీనిపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 3 వారాలకు వాయిదా వేసింది హైకోర్టు.

# ఉద్యోగం కోసం యుద్ధాన్ని లెక్కచేయక!

**యూపీ యువత.. ఇజ్రాయెల్ బాట**

**జాబ్ కోసం సంక్షోభ పరిస్థితుల్లోకి..**

**ఇక్కడ నిరుద్యోగం, చాలీచాలని జీతం**



**లక్నో:**: ఏడాదికాలంగా యుద్ధంలో కూరుకుపోయిన ఇజ్రాయెల్‌కు వెళ్లేందుకు ప్రపంచ దేశాల ప్రజలు ధైర్యం చేయడం లేదు. అయితే, మన దేశంలోని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకులు మాత్రం సంక్షోభంలో ఉన్న దేశాన్ని వెతుక్కుంటూ వెళ్తున్నారు. ఇజ్రాయెల్‌లో వివిధ రంగాల కార్మికులకు తీవ్ర కొరత ఉంది. పాలస్తీనా నుంచి వచ్చే కార్మికులపై ఆంక్షలతో కొరత మరింత పెరిగింది. దీంతో ఆ దేశ పాపులేషన్, ఇమిగ్రేషన్ అండ్ బార్డర్ అథారిటీ(పీఐబీఏ), భారత నేషనల్ స్కిల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌డీసీ) కలిసి యూపీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయి. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగిన నియామక కార్యక్రమానికి వందలాదిగా యువకులు హాజరయ్యారు. వీరంతా ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదివిన వారే. యూపీలో నిరుద్యోగం తీవ్రంగా ఉండటం, ఏదైనా పని దొరికినా చాలీచాలని వేతనం కారణంగానే ఇజ్రాయెల్ వెళ్లాలని అనుకుంటున్నట్టు యువకులు చెప్తున్నారు. ఇక్కడ రోజుకు రూ.500 దొరకడం కూడా కష్టమేనని, ఇజ్రాయెల్‌లో నెలకు రూ.1.37 లక్షల నుంచి రూ.1.92 లక్షల వరకు వేతనం వస్తున్నదని, అందుకే యుద్ధం జరుగుతుందని తెలిసినా వెళ్తున్నామని అంటున్నారు.

# అసోంలో బీఫ్ బ్యాన్?
## అసోం ప్రభుత్వం కీలక నిర్ణయం

అసోం: అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హెూటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డు మాంసం విక్రయించడాన్ని, తినడాన్ని నిషేధిస్తున్నట్లు సీఎం హిమంత బుధవారం ప్రకటించారు. 'రెస్టారెంట్లు, హెూటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో గొడ్డు మాంసం విక్రయించడాన్ని, తినడాన్ని నిషేధించాలని నిర్ణయం తీసుకున్నాం' అని మీడియా సమావేశంలో సీఎం చెప్పారు.కాగా, రాష్ట్రంలో ఇప్పటికే గొడ్డు మాంసం వినియోగంపై ఆంక్షలు ఉన్నాయి. అయితే ఆ చట్టాన్ని సవరించి కొత్త నిబంధనలను చేర్చాలని రాష్ట్ర మంత్రివర్గం తాజా సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీఫ్? వ్యవహారంపై కొద్దిరోజులుగా అసోంలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ నేపథ్యంలో హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాసేపటికే కాంగ్రెస్?కు అధికార పక్షం ఓ సవాలు విసిరింది. "బీఫ్? బ్యాన్?ను కాంగ్రెస్ సమర్థించాలి. లేదంటే ఆ పార్టీ నేతలు పాకిస్థాన్? వెళ్లిపోవాలి" అని ట్వీట్ చేశారు అసోం మంత్రి పిజూష్ హజారికా.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ



**చేవెళ్ల డిసెంబర్ 04( నినాదం న్యూస్):**
హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి- 163 పై సోమవారం ఆలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను క్షతగాత్రులను బుధవారం సాయంత్రం చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన రోజున ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో ఉన్నందువల్ల రాలేకపోయానని ఈరోజు కూడా పార్లమెంటు సమావేశాలను అర్ధాంతరంగా ముగించుకొని ఎయిర్పోర్ట్ నుండి నేరుగా ఆలూరు కు రావడం జరిగిందని ఆయన చెప్పారు. ఇదే రోడ్డులో ప్రయాణిస్తూ మృతి చెందిన పొద్దటూరు గ్రామానికి చెందిన మేకల లక్ష్మారెడ్డి దంపతుల కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు. మొదల కుటుంబాలకు భరోసానిచ్చి సానుభూతిని తెలిపారు. ఈ రోడ్డు పనుల పర్యవేక్షణ చేయడానికి నవంబర్ నెల 18వ తేదీన హైదరాబాదులో నేషనల్ హైవే అథారిటీ ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఆ సమీక్ష సమావేశంలో పార్టీలకతీతంగా అనేకమంది ఈ ప్రాంత నాయకులు పాల్గొన్నారు. వాస్తవంగా నవంబర్ నెల 27వ తేదీననే ఈ పనులు ప్రారంభం కావలసి ఉండే అనివార్య కారణాలవల్ల ఆలస్యం జరిగింది. అయినా నేను ఢిల్లీలో ఉన్న కేంద్ర నేషనల్ హైవే అథారిటీ అధికారులు మరియు కేంద్ర రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరి గారితో సంప్రదించి నిన్ననే ఈ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం జరిగింది. కోర్టు కేసు పెండింగ్లో ఉన్నందున పూర్తిస్థాయిలో పనులు ప్రారంభించలేకపోయామని ఈనెల 13వ తేదీన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు పరిష్కారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అజీత్ నగర్ చౌరస్తాలోని మృగవని పార్కు వద్ద, చేవెళ్ల టౌన్ తర్వాత, ఖానాపూర్ కిలోమీటర్ నెంబర్ 26 వద్ద, మరియు ముడిమ్యాల ఫారెస్ట్ లో కిలోమీటర్ నెంబర్ 37 వద్ద రోడ్డుకు ఇరువైపులా రెండు నుండి రెండున్నర మీటర్ల వెడల్పుతో దాదాపు 43 కిలోమీటర్ల పరిధిలో ఉన్న చెట్ల పొదలను రోడ్డుకు అడ్డంగా ఉన్నటువంటి చెట్లను తొలగించే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదిక మొదలయ్యింది. తద్వారా ప్రస్తుతం ఉన్న రోడ్డు కన్నా ఇరువైపులా రోడ్డు ప్రక్కల ఉన్న అడ్డంకులు తొలగించడంతో కొంత కలుగుతుంది. ఈ రోడ్డు నిర్మాణాన్ని వీలైనంత తొందరలోనే పూర్తి చేయడానికి నా శాయశక్తిలో ప్రయత్నం చేస్తున్నానని కేంద్ర రాష్ట్ర అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, సమీక్షలు నిర్వహిస్తూ కృషి చేస్తున్నట్టు శ్రీ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు.



# రోడ్డు విస్తరణ పనులపై పొంతనలేని మాటలు

- ఎవరు మాటలు నమ్మాలి?
**అధికారులది ఒక మాట, ప్రజా ప్రతినిధులది మరో మాట**
- రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టండి
- లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం
- సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్



**చేవెళ్ల డిసెంబర్ 04(నినాదం న్యూస్):**
హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి పనులు అదిగో జరుగుతున్నాయి, ఇదిగో జరుగుతున్నాయి అని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కానీ అధికారుల మాటలకు ప్రజా ప్రతినిధుల మాటలకు పొంతన లేకుండా పోతుంది. అధికారంలో ఏ పార్టీ వాళ్ళు ఉన్నా కాలక్షేపం చేస్తూ అధికారంతో పబ్బం గడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేష్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ కేంద్రంలో పాత్రికేయుల సమావేశంలో సమతా సైనిక్ దళ్ నాయకులు ఏర్పుల మల్లేష్ మాట్లాడుతూ ఆదివారం, సోమవారం రోడ్డు ప్రమాదం జరిగిన రెండు ప్రమాదాలలో 6మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా ఎంత మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవాలి అని మండిపడ్డారు.ఈ రోడ్డు గుండా ప్రజాప్రతినిధులు నిత్యం ప్రయాణిస్తుంటారు.కానీ వారికి తెలియదు సామాన్య ప్రజల ఇబ్బందులు వారికి ఈ ప్రమాదాలు కంటికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. అధికారులు పనులు డిసెంబర్ 16 తరువాత ప్రారంభమవుతాయి అనిచెపతున్నారు. ప్రజాప్రతినిధులు మాత్రం నిన్న పనులు ప్రారంభించినట్లు ప్రకటనలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయం పక్కన పెట్టి రోడ్డు పనులు జరిగే విధంగా చర్యలు తీసుకువాలని సమతా సైనిక్ దళ్ డిమాండ్ చేస్తుంది. లేని పక్షంలో పెద్దతున్న ఉద్యమం చేస్తాము అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాచన్ పల్లి రామస్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంచంద్రయ్య, జి. బీమయ్య, బి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

**- మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్**
**- వెల్స్విన్ ఫౌండేషన్ ఏబీవీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు**







**చేవెళ్ల డిసెంబర్ 04(నినాదం న్యూస్):**
పేద ప్రజల శ్రేయస్సు కై ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం నాగర్ గూడ గ్రామంలో వెల్స్విన్ ఫౌండేషన్, ఏబీవీ వైద్య శాల వారి సంయుక్తంగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నాగర్ గూడ గ్రామ మాజీ సర్పంచ్ ఈదుల కృష్ణ గౌడ్, వెల్ఫేర్ ఫౌండేషన్ సిఎస్ఆర్ సురేఖ ఏబీవీ వైద్యశాల సిబ్బందితో కలిసి ప్రారంభించారు. పేద ప్రజలు అనారోగ్యాల పాడిన పడకుండా పేద ప్రజల శ్రేయస్ కై ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకున్నవారికి మందులు పంపిణీ చేసారు. వెల్స్ఫన్ ఫౌండేషన్ సి ఎస్ ఆర్ హెడ్ సురేఖ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 110 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకుని, ఇంజక్షన్లు తీసుకున్నారని, బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించామని, గ్రామస్తులకు కీళ్ళ, సంబంధించిన వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసారని అన్నారు. వారికీ కావలసిన మందులను పంపిణీ చేస్తేవాళ్ళు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీ హాస్పిటల్ సిబ్బంది మరియు వెల్ఫేన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య బీసీఐ మేనేజర్ పవన్ కుమార్, శిరీష , రమేష్ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల ప్రజాపాలన దినోత్సవ సంబరాలు

**చేవెళ్ల డిసెంబరు 04 (నినాదం న్యూస్):**



ప్రజా పాలన విజయోత్సవ సంబరాలను పురస్కరించుకొని చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాపాలన ఇన్చార్జి వినోద్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు యాదయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి సరిగ్గా సంవత్సరం గడవకముందే ఎన్నో విమర్శలు చేస్తున్నరు, సంవత్సర కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు లక్షల రుణమాఫీ, కరెంట్ బిల్లు ఉచితంగా 200 యూనిట్లు, గ్యాస్ సిలిండర్ ద్వారా 500 రూపాయలు ఇవన్నీ అమలు చేసాము, అంతేకాక నిరుద్యోగులకు ప్రకటించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం, 55 వేల ఉద్యోగాలు భర్తీ చేసాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి గారు, మాజీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలుపాల్గొన్నారు.



# యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా జక్కుల అనిల్




**భీమదేవరపల్లి డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల యువజన అధ్యక్షునిగా ములుకనూరు గ్రామానికి చెందిన జక్కుల అనిల్ ఎన్నికయ్యారు. ఇటీవల యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించగా బుధవారం ఫలితాలు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 961 ఓట్లు సాధించి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి కైవసం చేసుకున్నారు. చిట్కూరి అనిల్ 614 ఓట్లు, బుర్ర రమేష్ 175 ఓట్లు, గుడికందుల రాజు 153 ఓట్లతో ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పబ్బా అజయ్ 25 ఓట్లు సాధించగా ప్రధాన కార్యదర్శి పదవి సాధించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ మాట్లాడుతూ.. నా గెలుపులో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఊసకోయిల ప్రకాష్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు గజ్జెల రమేష్ కృషి ఉందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడుతానన్నారు.

# డిజిటల్ అరెస్ట్ మోసాల వల్ల రూ.120 కోట్లు కోల్పోయిన భారతీయులు



**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్)**

ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో డిజిటల్ అరెస్ట్ మోసాల వల్ల భారతీయులు రూ.120 కోట్లను కోల్పోయారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. సైబర్ మోసగాళ్లు చట్టాన్ని అమలు చేసే అధికారులుగా వ్యవహరిస్తూ%ౌ% చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేలా చేసి.. బాధితుల నుంచి డబ్బును డిమాండ్ చేసే వ్యవహారాన్నే డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్స్ అంటారు. ఈ వ్యవహారం గురించి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (జనవరి %-% ఏప్రిల్) భారతీయులు డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్స్ వల్ల రూ.120.30 కోట్లు, ట్రేడింగ్ స్కామ్ వల్ల రూ.1,420.48 కోట్లు, పెట్టుబడుల కుంభకోణం వల్ల రూ. 222.58 కోట్లు, రొమాన్స్ అండ్ డేటింగ్ స్కామ్ వల్ల రూ.13.23 కోట్లను కోల్పోయినట్లు మేము గుర్తించాము. డిజిటల్ అరెస్ట్ మోసాలకు పాల్పడే వారిలో చాలామంది లావోస్, మయన్మార్, కంబోడియాలో ఉంటున్నారు. ఈ దేశాల్లో ఉన్నవారు ఉద్యోగ ఉపాధి అవకాశాల పేరుతో భారతీయుల్ని సోషల్‌మీడియా ద్వారా ట్రాప్ చేసి.. వారి ద్వారా సైబర్ క్రైమ్ నేరాలకు పాల్పడుతున్నారు' అని ఆయన అన్నారు. ఈ డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ హెచ్చరించారు.

కాగా, సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెలల మధ్య కాలంలో 7.4 లక్షల ఫిర్యాదులు వచ్చాయని నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సిఆర్‌పి) డేటా వెల్లడించింది. 2023 సంవత్సర కాలంలో 15.56 లక్షల ఫిర్యాదులు, 2022లో 9.66 లక్షల ఫిర్యాదులు అందాయని ఎన్‌సిఆర్‌పి డేటా తెలిపింది.

# మహాదేవపురంలో తాగునీటి ఇబ్బందులు తొలగించండి

**- వారానికి కనీసం రెండుసార్లయినా నీటి సరఫరా చేయాలి**

**- కార్పొరేటర్ రావుల శేషగిరికి అసోసియేషన్ సభ్యుల వినతి**

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్)**



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ మహాదేవపురం కాలనీలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ కు విన్నవించారు. బుధవారం మహాదేవపురం కాలనీ అసోసియేషన్ సభ్యులు డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ని కలిసి తాగునీటి సరఫరా లో జరుగుతున్న అవాంతరాలను వివరించి వారానికి కనీసం రెండుసార్లు అయినా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పందిస్తూ మహాదేవపురం కాలనీలో తాగునీటి సరఫరా లో జరుగుతున్న ఇబ్బందులను తొలగిస్తూ తాగునీటిని అవసరమైన మేరకు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటానని అసోసియేషన్ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ విషయంపై కార్పొరేటర్ రావుల శేషగిరి జలమండలి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి నీటి సరఫరా లో జరుగుతున్న ఇబ్బందులను వివరించారు. రాబోవు వేసవి కాలం ను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి సరఫరా లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సాంబశివరావు, సురేష్ రెడ్డి, సిద్ధార్థ నాయుడు, రవి, రాజు, శ్యాం ప్రసాద్, కమలాకర్, భూపాల్ రెడ్డి, రాములు, పద్మ, సత్యనారాయణ రెడ్డి, సురేష్, సత్యనారాయణ, కోటిరెడ్డి, రత్నం. తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**చింతపల్లి ,డిసెంబర్ 4 (నినాదం న్యూస్)**



మండల బిజెపి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాలు నాయక్ బైకు ర్యాలీకి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.మండల పార్టీ అధ్యక్షులు, శివర్ల రమేష్ యాదవ్, బైక్ ర్యాలీ నియోజకవర్గ ఇన్చార్జ్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన బైక్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి చెన మోని రాములు, అసెంబ్లీ కన్వీనర్ ఏ.టి. కృష్ణ, అంకూరి నరసింహలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 100 రోజులలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వము అన్ని రంగాలలో విఫల మైందని వారు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం లోనీ బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గుండాల అంజయ్య ,ఆంజీ నాయక్, సముద్రాల నగేష్, వేన్నం శేఖర్, మండల ప్రధాన కార్యదర్శిలు, కట్ట సైదులు, బొడ్డు మహేష్, యువ మోర్చా నాయకులు కుందేల శ్రీశైలం, గజ్జ అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నుంచి పలాయనం

**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్)**

ప్లాస్టిక్ ప్రమాదకరమని తెలిసీ దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాం. మన ఊహకందని మార్గాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరుకుంటూనే ఉంది. ఆ ప్లాస్టిక్ మహమ్మారి నుంచి ఎలా తప్పించుకోవచ్చో తెలుసుకుందాం!

ప్లాస్టిక్ నుంచి పలాయనం

ప్లాస్టిక్ ప్రమాదకరమని తెలిసీ దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాం. మన ఊహకందని మార్గాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరుకుంటూనే ఉంది. ఆ ప్లాస్టిక్ మహమ్మారి నుంచి ఎలా తప్పించుకోవచ్చో తెలుసుకుందాం!

ప్లాస్టిక్ వస్తువుల్లో ప్రమాదకర బిస్ఫినాల్ రసాయనం దాగి ఉంటుంది. ప్లాస్టిక్ వేడికి గురయినప్పుడు ఈ రసాయనం బయటకు వచ్చేస్తూ ఉంటుంది. నిల్వ పదార్థాలను ప్లాస్టిక్ సీసాలో నింపేటప్పుడు, మూతను స్టెరిలైజ్ చేస్తారు. ఆ క్రమంలో వేడి వెలువడి, ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు పదార్థాల్లో కలుస్తాయి. సూపర్ మార్కెట్‌లో నీళ్ల డబ్బాలు కొంటూ ఉంటాం. కానీ ఆ సీసాలు షాపుకు చేరేలోపు ఎంతసేపు ఎండకు గురయ్యాయి? దుకాణాల్లో వాటిని నిల్వ చేసే జాగా లేక, బయట ఉంచి, తర్వాత ఫ్రిజ్‌లో పెట్టారా? అనేది ఎవరికి తెలుసు? ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్లాస్టిక్ లంచ్ బాక్సుల్లో పదార్థాలు సర్దుకుంటున్నాం! కానీ పదార్థాలు చల్లారేంత సమయం ఆగుతున్నామా? ఓవెన్‌లో పదార్థాలు వేడిచేసే పాత్రలు ప్రధానంగా ప్లాస్టిక్‌తోనే తయారవుతూ ఉంటాయి. పిల్లలు ఆడుకునే వస్తువుల్లో 90్ర ప్లాస్టిక్‌వే! కర్రీ పాయింట్ నుంచి కూరలు తెచ్చుకున్నా, టీ షాపు నుంచి టీ తెప్పించుకున్నా, వాటిని ప్యాక్ చేస్తున్నదీ ప్లాస్టిక్ కవర్లలోనే!

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు ఇవే!

టూత్‌బ్రష లాంటి కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలు (వేప పుల్ల) ఉన్నా ఉరుకులు పరుగుల జీవితంలో వాటిని పాటించడం కొంత కష్టం. కాబట్టి తప్పనిసరిగా ఉపయోగించవలసివచ్చే కొన్ని ప్లాస్టిక్ వస్తువుల్లో మేలైనవి, బిపిఎ ఫ్రీ రకానికి చెందినవే ఎంచుకోవాలి. ఆ వస్తువులు కొనే సమయంలో, లేబుల్ మీద బిపిఎ ఫ్రీ అని రాసి ఉందో, లేదో గమనించాలి. సాధారణంగా ప్రసిద్ధ కంపెనీలు తయారుచేసే ప్లాసిక్ వస్తువులు ఈ కోవకే చెంది ఉంటాయి. కాబట్టి ప్లాస్టిక్ నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. అలాగే కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వస్తువులు ఎంచుకోవాలి. అవేంటంటే....



ప్లాస్టిక్ బాటిల్
ప్రత్యామ్నాయం: గాజు సీసా, స్టీలు లేదా రాగి బాటిల్

ప్లాస్టిక్ గిన్నెలు
ప్రత్యామ్నాయం: ఓవెన్‌లో గాజు లేదా పింగాణీ గిన్నెలే వాడాలి.

ప్లాస్టిక్ ప్లేట్లు
ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ ప్లేట్లలో భోజనం చేయాలి

ప్లాస్టిక్ కప్పులు
ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ కప్పులు

ప్లాస్టిక్ ఆట వస్తువులు
ప్రత్యామ్నాయం: సాఫ్ట్ టాయిస్

ప్లాస్టిక్ స్ట్రా
ప్రత్యామ్నాయం: స్టీలు స్ట్రా

మూడు తరాల వరకూ...

ప్లాస్టిక్ వాడకంతో శరీరం మీద పడే దుష్ప్రభావాలు మూడు తరాల వరకూ కొనసాగుతాయి. బాల్యంలో, యుక్తవయసులో, మధ్య వయసులో... ఇలా జీవితంలోని మూడు దశల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తాయి. అండాలు, వీర్యకణాల డిఎన్‌ఎల్లో తేడాలు ఏర్పడి, మూడు తరాల వరకూ పునరుత్పత్తి సమస్యలు వంశపారంపర్యంగా కొనసాగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి సా?ధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడాలి.

# చలికాలంలో పిల్లల రక్షణ ఇలా..



**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**

శీతాకాలం (చలికాలం)లో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి. ఈ కాలపు వాతావరణం పిల్లల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఈ కాలంలోనే పిల్లల రోగ నిరోధక శక్తి క్షీణించి వారి ఆరోగ్యం సన్నగిల్లుతుంది. ఫలితంగా వారు చురుగ్గా కాకుండా నీరసంగా ఉంటారు. అనేక సీజనల్ సమస్యలకు లోనవుతారు. సరైన ఆహారం తీసుకోకపోవటం వల్ల శరీరం బ్యాక్టీరియా, జెమ్స్‌తో పోరాడే రోగనిరోధక శక్తిని కోల్పో తుంటారు. పిల్లలైనా, పెద్దలైనా చలికాలంలో సరైన డైట్ పాటించటం చాలా ముఖ్యం. అంతేకాక ఆహారపు అలవాట్లలో కొన్ని రకాల మార్పులు చేయటం తప్పనిసరి కూడా. పిల్లలు తీసుకునే ఆహారంలో తగినన్ని పోషకాలు, విటమిన్లు, మినరల్స్ ఉండేలా శ్రద్ధ తీసుకోవాలి. ఆకుకూరలు తినటం ద్వారా అధికమొత్తంలో పోషకాలు, విటమిన్లు ఉంటాయి. పాలకూర, మెంతికూర, ఉల్లికాడలు, తాజా వెల్లుల్లిని పిల్లల ఆహారంలో చేర్చటం వల్ల వారికి ఎక్కువ మొత్తంలో ఫైటోన్యూట్రీయెంట్స్, విటమిన్లు, మినరల్స్‌ను అందించొచ్చు. ఆకుకూరలతోపాటు పప్పు కూడా తినిపిస్తే మరిన్ని ఎక్కువ పోషకాలు శరీరానికి అందుతాయి. ఎక్కువగా దగ్గు, జ్వరం, జలుబు వంటివి పీడిస్తుంటాయి. ఈకాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తి చెందుతాయి. మరీ ముఖ్యంగా చిన్న పిల్లలు జబ్బుల బారిన పడుతుంటారు. రాబోయే మూడు నెలలు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రధానంగా కేంద్రీకరించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల ఆరోగ్యంపై ఈ కాలంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఈ కాలంలో ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం. **దుస్తులు :** పిల్లలను తీవ్రమైన చలి నుంచి రక్షించి వారి శరీరం వెచ్చగా ఉండేలా పెద్దలు జాగ్రత్త తీసుకోవాలి. అందుకే ఉన్ని స్వెట్టర్లు తప్పనిసరిగా వేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే చేతులకు గ్లవ్స్, కాళ్లకు సాక్స్ వేయాలి. బయటకు వెళ్తే బూట్లు ఉండేలా చూడాలి. పిల్లల శరీరానికి నేరుగా చల్లగాలి తగలకుండా చూసుకోవాలి. పిల్లల శరీరంలో వెచ్చదనం తగ్గితే జ్వరం వచ్చే రిస్క్ పెరుగుతుంది. జలుబు, దగ్గు లాంటివి వస్తాయి. సీజన్ మారినప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులు పిల్లలకు ఇబ్బంది కలిగిస్తాయి. పిల్లల ముఖం, శరీరంపై సూక్ష్మక్రిములు దాడి చేస్తాయి. అందువల్ల పిల్లలకు డ్రెస్ విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం, శరీరం మొత్తం కప్పి ఉంచే డ్రెస్ వెయ్యాలి. చలి తగలకుండా.. వెచ్చదనం ఉండేలా చెయ్యాలి. ఫుల్ స్లీవ్స్, మంకీ క్యాప్స్, ఫుల్ లెంగ్త్ పాంట్స్ వాడాలి.

**పరిశుభ్రత :** పిల్లల గది, ఆడుకునే ప్రదేశాలు, చదువుకునే ప్రదేశం అన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. పిల్లలు ఎక్కువగా ఇండోర్స్‌లోనే ఉంటారు కాబట్టి ప్రతి రోజూ ఇల్లు పరిశుభ్రంగా ఉంచాలి. పిల్లలకు వాడే బట్టలు, సాక్స్, స్కూల్ బ్యాగ్స్, బొమ్మలు అన్నీ పొడిగా, శుభ్రంగా ఉండాలి.

**సరైన ఆహారం :** పిల్లలకు ఏడాదంతా పౌష్టికాహారం అందించడం అత్యవసరం. తినే ఆహారంపైనే వారి ఇమ్యూనిటీ ఆధారపడి ఉంటుంది. అందువల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పాలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు, ఆకు కూరలను ఎక్కువగా ఇవ్వాలి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి. విటమిన్ సి, ఐరన్, జింక్ వంటి మినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే రోగ నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయలు, గోధుమలు, నాటు గుడ్లు వంటివి ఇందులో చేర్చాలి.

**నీరు:** చలికాలంలో చర్మం త్వరగా పొడిబారిపోతుంది. సాధారణంగా ఎక్కువగా దాహం వేయదు. అందుకే పిల్లలు ఎక్కువ నీరు తాగరు. తగినంత నీరు తాగకపోతే చలికాలంలో శ్వాసకోశ ఇబ్బందులు ఏర్పడతాయి. జలుబు, దగ్గు వచ్చే రిస్క్ పెరుగుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటికి వెళ్లటం కష్టమవుతుంది. అందువల్ల పిల్లలతో నీరు బాగా తాగిస్తూ ఉండాలి. నీరు చర్మాన్ని తేమగా ఉంచి.. బ్యాక్టీరియాతో పోరాడేలా చేస్తుంది. నీటి వల్ల శరీరం.. విష వ్యర్థాలను బయటకు పంపేందుకు వీలవుతుంది. చలి కాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టనందున పిల్లలు తక్కువ నీరు తాగు తుంటారు. వారితో ఎక్కువ నీరు తాగించాలి. వీలైనంత వరకు గోరువెచ్చని నీరు అందించాలి.

**నిద్ర :** చలికాలంలో పిల్లలు బాగా నిద్రపోయేలా చెయ్యాలి. తద్వారా వారి ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది. శారీరకంగా కూడా పిల్లలు ఎదిగేందుకు నిద్ర చాలా అవసరం. రోజూ కనీసం 7 గంటలైనా పడుకునేలా చెయ్యండి.



**టీకాలు వేయించాలి**

ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాది పిల్లలకు రెండుసార్లు వేస్తారు. ఆ తర్వాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి.

**సొంత వైద్యం సరికాదు**

చలి కాలంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణంలోని మార్పులు, చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతోపాటు శ్వాసకోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారీ వారికి యాంటీబయాటిక్ ఇస్తుంటారు. ఫార్మసీకి వెళ్లి యాంటీబయాటిక్స్ తీసుకురావడం, జలుబు, దగ్గుకు సొంతంగా ఔషధాలు వేస్తుంటారు. ఇలా ప్రతిసారీ ఇవ్వడంతో సహజమైన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

**వ్యాయామం**

పిల్లలను ఆడుకోనివ్వాలి. సూర్యకాంతిలో ఆడుకునే అవకాశం ఇవ్వాలి. రెగ్యులర్ వ్యాయామం పిల్లల పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రన్నింగ్, జాగింగ్, సైక్లింగ్, స్కిప్పింగ్ లాంటివి చేయించాలి. వ్యాయామం వల్ల శరీరంలో వెచ్చదనం కూడా పెరుగుతుంది. ఫిట్‌గా ఉంటారు. వ్యాధి కారకాలతో శరీరం మెరుగ్గా పోరాడగల్గుతుంది. ఉదయం ఎండ వచ్చాక వారిని కాసేపు సూర్యరశ్మి తగిలేలా తీసుకెళ్లాలి. దీంతో శరీరానికి కాస్త వేడి తగులుతుంది. రోగ నిరోధకశక్తిని పెంచే విటమిన్ డి కూడా లభిస్తుంది. అయితే ఎక్కువగా చలిగా ఉన్నప్పుడు పిల్లలను బయటకు తీసుకెళ్లకూడదు.

**జాగ్రత్తలివే..**

రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసు కోవాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్తలు వహించాలి.

వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపీ), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి.

చలికాలంలో ముఖం, చేతులు, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. తల స్నానానికి ముందు నూనె రాసి కాసేపు ఉంచిన తర్వాత స్నానం చేయించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. స్నానం వేడి నీటితో చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

# పిల్లలతో బంధాన్ని పెంచుకోండి!



**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**

తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. అంతులేని ప్రేమాభిమానాలు పంచుతూ ఎంతో అపురూపంగా పెంచుతుంటారు. పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ సమయమంతా గడిపేస్తుంటారు. తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. అంతులేని ప్రేమాభిమానాలు పంచుతూ ఎంతో అపురూపంగా పెంచుతుంటారు. పిల్లల భవిష్యత్తు గురించే ఆలోచిస్తూ సమయమంతా గడిపేస్తుంటారు. ఈ క్రమంలో పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఏర్పడే బంధం పిల్లల మానసిక పరిపక్వతకు, తల్లిదండ్రుల సంతోషానికి దోహదం చేస్తుంది. ఈ ప్రేమ బంధం బలపడేలా తల్లిదండ్రులు పిల్లలతో సరదాగా **ఎలా గడపాలో తెలుసుకుందాం!**

**కథలు చెబుతూ**

ప్రతిరోజూ పడుకునేముందు పిల్లలకు రకరకాల కథలు చెప్పండి. ఆ కథలు వింటూ పిల్లలు ఎన్నో ప్రశ్నలు అడుగుతారు. వాటన్నింటికీ ఓపికగా సమాధాలు చెబితే పిల్లల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెరుగుతాయి. అలాగే మంచి పుస్తకాలను దగ్గరుండి చదివించండి. ఇలా రోజుకు అర్ధగంటసేపు పిల్లలతో గడిపితే వారిలో అమ్మనాన్న తమతో ఉన్నారన్న భద్రతా భావం కలుగుతుంది. దీంతో పిల్లలు స్వతంత్రంగా ఆడుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెడతారు. ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో పంచుకుంటూ అనుబంధం పెంచుకుంటారు.

**సృజనాత్మకంగా**

పిల్లలతో కలిసి బొమ్మలు వేయండి. రంగులు దిద్దండి. దీనివల్ల పిల్లలకు రంగుల గురించి తెలుస్తుంది. వారిలో కళాత్మక దృష్టి పెరుగుతుంది. కాగితంతో బొమ్మలు చేయడం, ఊలుతో అల్లికలను నేర్పించండి. మీలో ఉన్న ఈ ప్రత్యేకతలు పిల్లలను ఉత్సాహపరచడమే కాదు వారికి మీపై అభిమానం పెరిగేలా చేస్తాయి.

**సహాయం అడుగుతూ**

మీ పనిలో సహాయం చేయమని పిల్లలను అడగండి. దీనివల్ల అందరూ కలిసి పనిచేస్తే పనులు త్వరగా పూర్తిచేయవచ్చని పిల్లలకు తెలుస్తుంది. ఒక జట్టుగా పనిచేయడంలోని ఆనందం అర్ధమవుతుంది. బాధ్యతలు పంచుకోవాలనే ఆలోచన వస్తుంది. సంతోషంగా పనులు చేసే విధానం అవగతమవుతుంది. తల్లిదండ్రులపై గౌరవ భావం ఏర్పడుతుంది.

**నృత్యం చేస్తూ**

ఫ ఇంట్లో లైట్లన్నీ ఆర్పేయండి. కిటికీలను కర్టెన్లతో మూసేయండి. టీవీలో లేదా ఫోన్‌లో మీకు ఇష్టమైన సంగీతం లేదంటే పాట పెట్టండి. దానికి తగ్గట్టు డ్యాన్స్ చేయండి. పిల్లలచేత కూడా చేయించండి. ఇలా కుటుంబ సభ్యులందరితో కలిసి డ్యాన్స్ చేయడం పిల్లల్లో సంతోషాన్ని నింపుతుంది. ఇది వారికి మర్చిపోలేని అనుభూతిని ఇస్తుంది. ఇంతటి మధురమైన సంఘటనను సృష్టించిన అమ్మనాన్నలపై ప్రేమను కలిగిస్తుంది.

సెలవు రోజున ఇంట్లో ఉన్న దుప్పట్లు, దిండ్లు అన్నింటినీ ఒక చోట చేర్చండి. పిల్లలతో కలిసి ఒక గుడిసె లేదా ఒక కోటలా నిర్మించండి. అందులో పిల్లలతో కలిసి అంత్యాక్షరి, చదరంగం, క్యారమ్స్ లాంటి ఆటలు ఆడండి. దీనివల్ల పిల్లల్లో ఊహాత్మక శక్తి పెరుగుతుంది. అమ్మనాన్నలతో కలిసి ఆడుకుంటున్నామనే ఆనందం కలుగుతుంది. ఇటువంటి సరదాలు తల్లిదండ్రులకు పిల్లలను దగ్గర చేస్తాయి.

**సినిమాలు చూస్తూ**

స్ఫూర్తిదాయకమైన లేదా నవ్వించే సినిమాలను పిల్లలతో కలిసి చూడండి. సినిమా చూస్తూ అందులోని సంఘటనలను చర్చించండి. సినిమాకి సంబంధించి పిల్లల సందేహాలు తీర్చండి. దీనివల్ల పిల్లల్లో సంభాషణా నైపుణ్యం పెరుగుతుంది. లోకజ్ఞానం తెలుస్తుంది. తల్లిదండ్రులతో గడిపిన ఆ క్షణాలు పిల్లల మనసుల్లో ఎప్పటికీ నిలిచి ఉంటాయి.

# స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే జుట్టు రాలదు..



**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**
ప్రస్తుతం చాలా మంది జుట్టు రాలే సమస్యతో ఎక్కువగా బాధపడుతున్నారు. అయితే, స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే జుట్టు రాలదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.. స్నానం చేసేటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే జుట్టు రాలదు.. కావాలంటే ట్రై చేయండి.. ప్రస్తుతం చాలా మంది జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల జుట్టు సమస్యలు అన్ని వయసుల వారికి సర్వసాధారణంగా మారాయి. కెమికల్ బేస్డ్ ప్రొడక్ట్స్ వాడితే జుట్టు మరింత డ్యామేజ్ అవుతుంది. తలస్నానం చేసేటప్పుడు మీ జుట్టును శుభ్రంగా కడగకపోతే, షాంపూలోని రసాయనాలు అలాగే ఉండి మీ జుట్టును పాడు చేస్తాయి. జుట్టు రాలడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం కావచ్చు. అయితే, ఈ సమస్యను తగ్గించేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా జుట్టు రాలడం తగ్గడం లేదా? తరచూ షాంపూ, ఆయిల్ మార్చుకున్నా జుట్టు రాలుతునే ఉందా? అయితే కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే జుట్టు రాలడం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

సల్ఫేట్ లేని షాంపూ..

తలస్నానం చేసేటప్పుడు కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జుట్టు రాలడాన్ని నివారించడానికి సల్ఫేట్ లేని షాంపూని ఉపయోగించి మీ జుట్టును కడగాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ఇలా చేస్తే జుట్టు పొడవుగా, ఆరోగ్యంగా ఉంటుందంటున్నారు.

వారానికి 2-3 సార్లు..

రోజూ తలస్నానం చేయడం వల్ల జుట్టు పొడిబారుతుంది. దీని వల్ల స్కాల్ప్ లో ఉండే సహజసిద్ధమైన నూనె నశించి జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. దీని నివారణకు వారానికి 2-3 సార్లు తలస్నానం చేస్తే సరిపోతుంది.

వేడి నీటితో స్నానం చేయవద్దు..

చాలా వేడి నీటితో స్నానం చేయవద్దు. ఇది జుట్టు రాలడానికి కారణమవుతుంది. మీరు తలస్నానం చేసేటప్పుడు మీ జుట్టును శుభ్రంగా కడగకపోతే, షాంపూలోని రసాయనాలు మీ జుట్టును పాడు చేస్తాయి. జుట్టు రాలడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం కావచ్చు.

నూనె రాసుకోండి..

నూనె రాసుకోకుండా జుట్టు కడగడం వల్ల కూడా జుట్టు రాలిపోతుంది. దీనిని నివారించాలంటే తలస్నానం చేసే ముందు జుట్టుకు నూనె రాసుకోవడం మంచిది. జుట్టుకు బాగా నూనె రాసి మసాజ్ చేసి కనీసం వారానికోసారైనా తలస్నానం చేయాలి. తలస్నానానికి ముందు తాజా కలబంద జెల్‌ను జుట్టు చివర్లలో అప్లై చేసి, కాసేపు అలాగే ఉంచి జుట్టును కడగాలి. ఇది జుట్టు సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుంది.

# బొద్దు ముద్దు కాదు

**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**
పిల్లలు ముద్దుగా బొద్దుగా ఉండాలి అని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అయితే పిల్లల బరువు వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవరోధం కాకుండా చూసుకోవాలి. ఊబకాయానికి ఆస్కారం లేని పిల్లల పోషకాహారం మీద ప్రతి తల్లీ దృష్టి పెట్టాలి.

బొద్దు ముద్దు కాదు

పిల్లలు ముద్దుగా బొద్దుగా ఉండాలి అని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అయితే పిల్లల బరువు వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవరోధం కాకుండా చూసుకోవాలి. ఊబకాయానికి ఆస్కారం లేని పిల్లల పోషకాహారం మీద ప్రతి తల్లీ దృష్టి పెట్టాలి.

శారీరక శ్రమ కొరవడడం, బయటి ఆహారం తినే అలవాటు పెరగడం పిల్లల ఊబకాయానికి ప్రధాన కారణాలు. అలాగే ల్యాప్‌టాపలు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం, చక్కెర, మైదాలతో తయారయ్యే చిరుతిళ్లు, పానీయాలు తాగే అలవాటు కూడా పిల్లల్లో పెరిగిపోతోంది. వీటన్నిటి వల్ల పిల్లల్లో ఊబకాయ సమస్య పెరిగిపోతోంది. కానీ పిల్లల భోజనానికి కొన్ని పోషక నియమాలున్నాయి. వాళ్ల భోజనంలో 30% పిండిపదార్థాలు, 30% కూరగాయలు, ఆకుకూరలు, 20% పండ్లు, 15 నుంచి 20% మాంసకృత్తులు, 5 నుంచి 10% (500 మిల్లీలీటర్లు) పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండు సార్లు పండ్లు, ప్రతి భోజనంలో కూరగాయలు, వయసును బట్టి రోజుకు ఒకసారి నట్స్‌ను నేరుగా అందించడం లేదా పొడి చేసి పాలలో కలిపి ఇవ్వడం చేస్తూ ఉండాలి. ఏడాది వయసు దాటిన పిల్లలైతే రెండేళ్ల వయసొచ్చేవరకూ వెన్న తీయని పాలు ఆ తర్వాత వెన్న తీసిన పాలు ఇవ్వాలి. వంట నూనెల విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకూ గానుగ నూనెలు వాడుకోవాలి. అలాగే నూనెలో



ముంచి వేయించిన పదార్థాలు తగ్గించాలి. వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడే అలవాటు మానుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే స్థూలకాయం దరి చేరదు.

తల్లితండ్రులే ఆదర్శం

ఇప్పటికే స్థూలకాయులుగా మారిన పిల్లల విషయంలో మరీ ముఖ్యంగా తల్లితండ్రులు వారికి ఆదర్శంగా మారాలి. తల్లితండ్రులు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అనుసరిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. లావుగా ఉన్న పిల్లలను 'లావుగా ఉన్నావు' అంటూ కించపరచడం వల్ల వాళ్లు మానసికంగా కుంగిపోతారు. కాబట్టి 'బరువు పెరగడం అనారోగ్యకరం, ఆరోగ్యకరమైన ఆహారం తింటూ, ఒళ్లు అలసిపోయేలా ఆడుకోవాలి' అంటూ పిల్లలను ప్రోత్సహించాలి. హోటల్ భోజనాలకు, స్విగ్గీ, జొమాటోలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పరిమితం చేయాలి. పాలిష్ పట్టని బియ్యం వాడుకుంటూ, భోజనంలో అన్నంతో సమానంగా కూరలు తినేలా పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలు విపరీతమైన ఊబకాయంతో బాధపడుతున్నప్పుడు పిల్లల వైద్యులను తప్పక కలవాలి.

చక్కెరకు దూరంగా...

పిల్లలను చక్కెరకు వీలైనంత దూరంగా ఉంచాలి. తీపి పదార్థాల పట్ల వ్యామోహం ఏర్పడకుండా చూసుకోవాలి. అరుదుగా, పరిమితంగానే పిల్లలకు తీపిపదార్థాలు అందించాలి. చక్కెర కంటే బెల్లం మేలు అనేది కూడా అపోహే! చక్కెర కంటే బెల్లంతో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి. పాలల్లో కలిపే బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో కూడా చక్కెర ఉంటుంది. వీటి వల్ల పిల్లలకు అదనంగా ఒరిగే ప్రయోజనం కూడా ఏమీ ఉండదు. పసికందులకు పోత పాలు పట్టించేటప్పుడు కూడా చక్కెర కలపకుండా ఇవ్వాలి.

ఈ సమస్యలు తప్పవు

పిల్లల్లో ఊబకాయం వల్ల తక్షణమే ఆరోగ్య సమస్యలు బయల్పడకపోయినా, భవిష్యత్తులో కీళ్ల నొప్పులు, మధుమేహం, అధిక రక్తపోటు, యుక్తవయసులోనే గుండెపోటు, తిన్న వెంటనే వాంతి తెచ్చుకునే 'బులీమియా' లాంటి మానసిక సమస్యలు చిన్న వయసు నుంచే మొదలవుతాయి. కొన్ని రకాల హార్మోన్ల సమస్యలున్నప్పుడు కూడా పిల్లలు ఊబకాయుల్లా మారిపోతారు. పిల్లలు ఎత్తు పెరగకుండా, బరువు పెరుగుతుంటే, హార్మోన్ అసమతౌల్యంగా భావించి ఎండోక్రైనాలజిస్ట్ చేత పరీక్షలు చేయించాలి. పిల్లలకు రోజుకు గంట వ్యాయామం తప్పనిసరి. పరుగు, సైకిల్ తొక్కడం, ఈత, బ్యాడ్మింటన్... ఇలా నచ్చిన వ్యాయామం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. పిల్లలు టీనేజీకి చేరుకుని, ఎత్తు పెరగడం ఆగిపోయిన తర్వాతే బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. లేదంటే ఎత్తు పెరగడం ఆగిపోతుంది.

# వెక్కిరించిన వంటకాలే మెప్పించేలా..!

**హైదరాబాద్, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):**
తమ తెగ సంస్కృతి గురించి, ఆహారపు అలవాట్ల గురించి మధుస్మిత సోరెన్‌కు అవహేళనలు, అవమానాలు ఎదురుకాని రోజు లేదు. కానీ అవి ఆమెలో పట్టుదలను పెంచాయి. వంటకాల్లో ప్రయోగాలకు ప్రేరణనిచ్చాయి. ఇప్పుడు ఫుడ్ బ్లాగర్‌గా, కన్సల్టెంట్‌గా సంతాలీ గిరిజన రుచులను ఆమె ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేస్తున్నారు.



"ఇరవయ్యేళ్ళ క్రితం... ఎంతో ఉత్సాహంతో కొత్త బడిలోకి అడుగుపెట్టిన నాకు తొలి రోజే తోటి పిల్లల వెక్కిరింతలు స్వాగతం పలికాయి. "మీరు నత్తల్ని, చీమల్ని తింటారట కదా!" అంటూ ఆటపట్టించారు. ఆ తరువాత ఆ బడిలో ఉన్నంతవరకూ మా సంస్కృతి మీద, ఆహారపు అలవాట్ల మీదా ఈ దాడి కొనసాగుతూనే ఉంది. మొదట్లో ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని. ఆ తరువాత నేను పట్టించుకోవడం మానేశాను. ప్రతి తరగతిలోనూ మొదటి స్థానంలో నిలిచి... వాళ్ళకన్నా నాదే పైచెయ్యి అని నిరూపించడానికి ప్రయత్నించాను. కానీ వారి మాటలు నన్ను వెంటాడుతూనే ఉండేవి.

**నమ్మకం పెరిగింది...**

కొవిడ్‌కు ముందు 'ఒడిశా హోమ్‌ఛెఫ్' పోటీలు జరిగాయి. సంప్రదాయికమైన అంశాలేవీ మార్చకుండా... సంతాలీ వంటలకు సమకాలీనమైన హంగులు జోడించాను. ఆ పోటీలో మొదటి స్థానం నాదే. ఆ తరువాత జాతీయ స్థాయిలో 'మాస్టర్ చెఫ్' పోటీకి ఎంపికయ్యాను. 'పొలెంటా' అనేది ఇటాలియన్ వంటకం. దాన్ని కార్న్‌మీల్‌తో తయారు చేస్తారు. నేను మా ప్రాతంలో దొరికే ఎర్ర బియ్యం, చికెన్‌తో తయారు చేశాను. దానిలో నంజుకోవడానికి ఎర్ర చీమల (క్రై) చట్నీ రూపొందించాను. అవి న్యాయ నిర్ణేతలకు ఎంతగానో నచ్చాయి. ఒడిశాతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంతోమంది నన్ను అభినందించారు. దాంతో నా మీద నాకు నమ్మకం పెరిగింది. వంటల వీడియోల రూపకల్పనకు ప్రోత్సాహాన్నిచ్చింది. పూర్తిస్థాయి ఫుడ్‌బ్లాగర్‌గా మారాను. గిరిజన ఆహారాన్ని... సాధికారత చెక్కు చెదరకుండా... కొత్త పద్ధతులతో మేళవింపు చేయడం గురించి తెలుసుకోవడానికి ఆహార, ఆతి?థ్య రంగాలకు చెందిన వ్యక్తులు నన్ను సంప్రతించడం ఆరంభించారు. నాకు మంచి ప్రచారం వచ్చింది.

**అది గర్వంగా చెప్పుకోగలను...**

ప్రస్తుతం అనేక మంది చెఫ్‌లతో, ప్రముఖ రెస్టారెంట్లతో, హోటల్ శిక్షణ సంస్థలతో కలిసి పని చేస్తున్నాను. దాదాపు ప్రతి చోటా గిరిజన వంటకాలను వారి మెనూలో ఉండేలా చేయడం నేను సాధించిన విజయమని గర్వంగా చెప్పుకోగలను. విదేశాల్లోనూ ఇప్పుడు నాకు, నా వంటకాలకు ఎందరో అభిమానులున్నారు. నేను చదివిన 'కెఐఐటి', జయపురంలోని 'ఇందిరాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్' (ఐఐహెచ్‌ఎం)లలో గిరిజన ఆహార కన్సల్టెంట్‌గా ఉన్నాను. దేశవ్యాప్తంగా గిరిజన ఆహార పద్ధతులకు ప్రాచుర్యం తేవడానికి వర్క్‌షాపలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాను. నేను చేసే ప్రతి కొత్త ప్రయోగం నాలో ఆత్మవిశ్వాసం పెంచుతోంది. తరతరాల మా వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం, నా మూలాల పరిరక్షణకు పాటుపడడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను."

# తెలుగు రాష్ట్రాల్లో భూకంపం

- ములుగు జిల్లాలో భారీ భూకంపం
- ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ జనం
- ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీసిన జనం
- కొన్ని సెకన్ల పాటు కంపించిన భూమి
- ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ప్రకంపనల తీవ్రత
- తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం
- ఏపీ, తెలంగాణలో పలు జిల్లాలో కంపించిన భూమి
- మళ్లీ భూకంపం వచ్చే అవకాశం : నిపుణులు

**హైదరాబాద్, డిసెంబర్4 (నినాదం న్యూస్):** బుధవారం ఉదయం ములుగు జిల్లాలో భూకంపం సంభవించింది. దీని ప్రభావం రెండు తెలుగు రాష్ట్రాలపై పడిరది. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ప్రకంపనల తీవ్రత అధికంగా కనిపించింది. కూర్చున్న చోట చాలా మంది వణికిపోయారు. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల వరకు భూకంప ప్రభావం కనిపించింది. 4 డిసెంబర్ 2024 బుధవారం ఉదయం 7 గంటల 27నిమిషాలకు రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. వరంగల్ కు ఈశాన్యంగా 85కిలోమీటర్లు, హైదరాబాద్‌కు ఈశాన్యంగా 218, విజయవాడకు ఉత్తరంగా 212 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు తెలిపింది. భూమికి 40కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు గుర్తించారు. తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం అని చెప్పుకోవచ్చు. హైదరాబాద్ కు 300కిలోమీటర్ల దూరంలోని మహారాష్ట్ర లాతూరులో సమీపంలో ఆసాలో 6.2 మాగ్నిట్యూడ్‌తో 1993 లో భారీ భూకంపం వచ్చింది. అప్పట్లో 8 వేల మందికిపైగా చనిపోయారు. గడచిన 30ఏళ్లలో హైదరాబాద్ సమీపంలో ఇదే అతిపెద్ద భూకంపం. 1993 సెప్టెంబర్ 30న తెల్లవారు జామున 3గంటల 55 నిమిషాలకు వచ్చిన భూకంపం చుట్టుపక్కల ప్రాంతాలను వణికించింది. ఇది గత 124 సంవత్సరాలలో హైదరాబాద్ సమీపంలో సంభవించిన అత్యంత బలమైన భూకంపం . గడచిన 31ఏళ్లలో వచ్చిన హైదరాబాద్ సమీపంలో వచ్చిన వాటిలో లాతూర్ భూకంపం అతిపెద్దది. ఇప్పటి వరకు వచ్చిన భూకంపాల తీవ్రత 5.0 లోపే ఉండేది. హైదరాబాద్ నుంచి 300కిలోమీటర్ల పరిధి తీసుకుంటే గడచిన 10ఏళ్లలో 12 భూకంపాలు 4 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్నవి నమోదయ్యాయి. గడచిన 50ఏళ్లలో ఇవాళే తొలిసారిగా హైదరాబాద్ పరిధిలో 5 తీవ్రతకు మించి భూకంపం వచ్చింది. 2020 ఏప్రిల్ 24 ఆసిఫాబాద్‌లో 4.8తీవ్రతతో భూకంపం సంభవించింది. దాని తర్వాత మహారాష్ట్రకు చెందిన బాస్మత్‌లో 4.6 తీవ్రతో 2024 మార్చిలో భూకంపం సంభవించింది. 57 ఏళ్ల కిందట భద్రాచలంలో అతిపెద్ద భూకంపం వచ్చింది. ఏప్రిల్ 13, 1969 న రాత్రి 9గంటల ప్రాంతంలో వచ్చిన ఈ భూకంప కేంద్రాన్ని భద్రాచలానికి 14.2 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. అయితే 20 కిలోమీటర్ల లోతున రావడంతో ప్రభావం తక్కువగా ఉంది. 1969లో వచ్చిన భూకంపానికి సంబంధించి ప్రాణనష్టం జరిగినట్లుగా గుర్తించలేదు. హైదరాబాద్ మాత్రమే కాదు మొత్తం తెలంగాణ వ్యాప్తంగా తీసుకున్నా భూకంపాల తాకిడి ఎక్కువగానే ఉంది. తెలంగాణలో, తెలంగాణకు 300కిలోమీటర్ల పరిధిలో గడచిన 10ఏళ్లలో 17 భూకంపాలు.. 4 కంటే ఎక్కువ తీవ్రతతో వచ్చాయి. ఇవాళ ములుగులో వచ్చిన భూకంపం 40కిలోమీటర్ల లోతులో రావడం వల్ల తీవ్రత అంతగా తెలియలేదు. ఇది గోదావరి వాయువ్య, ఆగ్నేయ ఫాల్ట్ లైన్స్ పరిధిలో జరిగిందని.. ఈ ప్రాంతంలో భూకంపాల తీవ్రత ఉంటుందని నేషనల్ సెంటర్ ఫర్ సెస్మిలాజీ ఇవాల్టి రిపోర్టులో చెప్పింది. లాతూరు భూకంప కేంద్రం 6కిలోమీటర్ల లోతులో ఉండటం.. మాగ్నిట్యూడ్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల దాని ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఒక వేళ ఇదే తీవ్రతతో భూమి పై పొరల్లో వస్తే ఇక్కడ కూడా తీవ్రత హెచ్చుగానే ఉండే అవకాశం ఉంటుంది. కాగా భూకంపం... చాలా భయంకరమైన ప్రకృతి విపత్తు. ఇది వచ్చిందంటే చాలు సమస్తాన్ని తుడిచిపెట్టేస్తుంది. భూకంపం తీవ్రతను బట్టి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తుంటాయి. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఈ విలయం వలన ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో ఆస్తి నష్టం జరిగింది. ఇక భూకంపం సంభవించిన ప్రాంతాలు కోలుకోవడానికి ఏళ్ల సమయం పడుతుంది. ప్రస్తుతం భూకంపం టర్కీ, సిరియా దేశాలను అతలాకుతలం చేసింది. ఈ రెండు దేశాల్లో ఈ విపత్తు కారణంగా ఇప్పటివరకు 4500 మంది మరణించారు. 14వేల మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరగవచ్చనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్తి నష్టం ఎంతో ఇంకా అంచనా వేయలేదు. ఇప్పుడు ప్రపంచమంతా దీని గురించే మాట్లాడుకుంటోంది. ఈ క్రమంలో ఈ భూకంపాలు ఎలా వస్తాయో? దీనికి కారణాలేంటో తెలుసుకుందాం. భూమి లోపల అకస్మిక కదలికల కారణంగా భూకంపాలు సంభవిస్తుంటాయి. భూకంపం అనేది భూమి యొక్క క్రస్ట్‌లో అకస్మాత్తుగా విడుదలయ్యే స్ట్రెయిన్ ఎనర్జీ (ఒత్తిడి శక్తి). దీని ఫలితంగా భూమి లోపలి నుంచి బయటకు షేక్ చేసే తరంగాలు ఏర్పడతాయి. క్రస్ట్ లో ఏర్పడే ఒత్తిళ్లు చాలా వరకు రాతి పొర వరకు మాత్రమే వస్తాయి. రాతి పొర వాటిని పైకి రానీయకుండా చేస్తుంది. అయితే రాతి పొరను మించిపోయిన ఒత్తిడి వచ్చినప్పుడు... బలహీన ప్రాంతాన్ని టార్గెట్ చేస్తుంది. అప్పుడు భూకంపం ఏర్పడుతుంది. భూకంపం వచ్చినప్పుడు శక్తివంతమైన తరంగాలను విడుదల అవుతాయి.

# అందని ప్రధాని కిసాన్ యోజన పథకం

- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎదురుచూస్తున్న రైతులు
- 2018 కంటే పూర్వం పాస్ పుస్తకాలు ఉన్న రైతులకే లబ్ది
- 2018 తర్వాత పాస్ పుస్తకాలు ఉన్న రైతులకు అందని లబ్ది
- అధికారులకు చెప్పుకున్న ఫలితం లేదు

**కోదాడ, డిసెంబర్ 4 (నినాదం న్యూస్):** ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు ఆర్థిక చేయూత అందిస్తుంది కేంద్ర ప్రభుత్వం. ప్రతి ఏడాది రూ.6000 వారి ఖాతాల్లో ఈ పథకం ద్వారా డబ్బులు జమా చేస్తుంది.మొత్తం మూడు విడుతల్లో ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ.2,000 జమా చేస్తుంది. ఈ పథకం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 2019లో ప్రారంభమైంది.ప్రధాని కిసాన్ యోజన పథకం రైతులకు పంట సహాయం ఎకరాకు 2000 చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదు. యాదాద్రి భువనగిరి,




సూర్యాపేట ,నల్లగొండ జిల్లాల స్థాయిలో 2018 సంవత్సరం పూర్వం ఉన్న పాస్ పుస్తకాల చెందిన రైతులకు ప్రధాని కిసాన్ యోజన పథకం అందుతుందని, వ్యవసాయ విశ్లేషకులు రైతులు చెబుతున్నారు. సన్న కారు, చిన్న కారు రైతులకు ఎకరాకు 2000 వేల చొప్పున పంట సహాయం వచ్చిన ఎంతో ,కొంత ఆర్థికంగా ఊరట లభిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 2018 సంవత్సరం తర్వాత రెండెకరాల వరకు పాస్ పుస్తకాలు చేయించుకున్న రైతులు దాదాపు లక్ష వరకు ఉంటారని వ్యవసాయ అధికారుల అంచనా ఉంది. ప్రధాని కిసాన్ యోజన పథకం, సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కావడంతో జీవో పాస్ అయితేనే రైతులకు ప్రధాని కిసాన్ యోజన పథకం అందుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండలానికి ఐదు క్లస్టర్లు చొప్పున ఉండగా,ప్లాస్టర్ కు 200 మంది చొప్పున ఉండగా, దాదాపు 1000 నుండి 1200 మంది రైతుల వరకు, రెండే ఎకరాల లోపు పాస్ పుస్తక పాలు పొందిన రైతులు ఉన్నారు. గ్రామీణ స్థాయిలో రైతులు ఏఈఓ లకు,మండల వ్యవసాయ అధికారులకు, డివిజన్ వ్యవసాయ అధికారులకు పిఎం కిసాన్ అందేలా చూడాలని కోరగా, సంబంధిత అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ పరిశీలన అంశం ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ స్కీమ్ కావడంతో, గత ఆరు సంవత్సరాలుగా పాస్బుక్, పుస్తకాలు పొందిన రైతులకు న్యాయం చేయలేకపోతున్నామని చెబుతున్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ లు చొరవ తీసుకొని 2018 సంవత్సరం నుండి పాస్ పుస్తకాల పొందిన రైతులకు పీఎం కిసాన్ పథకం అందేలా చూడాలని, తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడి, తక్షణం రైతులకు న్యాయం చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

# వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- టీఎన్జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముజాహిద్ హుస్సేన్

**జమ్మికుంట, డిసెంబర్ 4 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ బుధవారం రోజు టి సి టి ఎన్జీవో సంఘం పక్షాన రెప్రెసెంటేషన్లు అందించటం జరిగింది వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్లకు ఏ సి టి ఓ ప్రమోషన్ వెంటనే ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీఫ్ సెక్రటరీ శాంత కుమారి రెవిన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ రజ్వి లకు ఇచ్చిన వినతి పత్రాలలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సీనియర్ అసిస్టెంట్లకు ఆరు సంవత్సరాల నుండి బదిలీలు లేక ఒకటే ప్రాంతంలో పనిచేస్తున్నారు బదిలీలు కావాలని ఎన్నోసార్లు సంఘం పక్షాన వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారం కాకపోవటంతో మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు ఇదే శాఖలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లకు ఏ సి టి ఓ లకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలని రాష్ట్ర ఐటి ఇండస్ట్రీస్ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు దృష్టికి కూడా తీసుకొని వెళ్లడం జరిగింది అయినప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారం కాకపోవటంతో ఈరోజు తెలంగాణ స్టేట్ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పక్షాన వినతి పత్రాలు ఇవ్వటం జరిగింది ఇప్పటికైనా ఈ సమస్య వెంటనే పరిష్కరించి జూనియర్ అసిస్టెంట్ లకు సీనియర్ అసిస్టెంట్లుగా సీనియర్ అసిస్టెంట్లకు ఏ సి టి ఓ ప్రమోషన్లు కల్పించాలని ఇచ్చిన వినతి పత్రాలలో కోరటం జరిగింది అన్ని ప్రభుత్వ శాఖలలో ప్రమోషన్లు బదిలీలు జరిగినప్పటికీ ఇప్పటివరకు మన వాణిజ్య పనుల శాఖలోనే ఈ సమస్య ఇప్పటివరకు పెండింగ్ ఉండటం చాలా బాధాకరమైన విషయమని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు ఇదే వాణిజ్య పనుల శాఖలో ఏ సి టి ఓ గా పని చేస్తున్న వారిని హొదా కల్పించాలని 2017 సంవత్సరంలో ఇచ్చిన



రిప్రజెంటేషన్ ఇప్పటివరకు పరిష్కారం కాకపోవటం చాలా బాధాకరమైన విషయమని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏసీటీ ఓ లకు గజిటెడ్ హొదా వెంటనే ఇవ్వాలని రాష్ట్ర మంత్రులు పున్నం ప్రభాకర్ కొండ సురేఖ సీతక్క తో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ మజ్లీస్ పార్టీ ఆరుగురు శాసనసభ్యులు శాసనమండలి ఇద్దరు సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు 18 మంది బిజెపి పార్టీ ఆరుగురు ఎమ్మెల్యేలు బి ఆర్ఎస్ పార్టీ నలుగురు ఎమ్మెల్యేలు సిపిఐ పార్టీ శాసనసభ పక్ష నాయకుడు తెలంగాణ గజిటెడ్ ఉద్యోగుల సంఘం పక్షాన వాణిజ్య పనుల శాఖలో ఉన్న తెలంగాణ గజిటెడ్ ఉద్యోగుల సంఘం పక్షాన ఇన్ని రకాల రిప్రజెంటేషన్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీఫ్ సెక్రటరీ శాంత కుమారి ఎక్సైజ్ మరియు వాణిజ్య పనుల శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఇవ్వటం జరిగింది అయినప్పటికీ 8 సంవత్సరాల నుండి ఇప్పటివరకు తెలంగాణ బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయ కార్యాలయంలోనే ఈ ఫైలు 8 సంవత్సరాల నుండి అక్కడ నుండి ఇక్కడికి ఇక్కడి నుండి ఎక్కడికి కదులుతూనే ఉంది తప్ప తెలంగాణ వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏ సి టి ఓ లకు ఇప్పటివరకు గజిటెడ్ హొదా తెలంగాణ ప్రభుత్వం ఇవ్వకపోవడం చాలా బాధాకరమైన విషయమని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కొత్త పిఆర్సి కమిషన్ రికమండేషన్ చేయటం జరిగింది ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఏ సి టి ఓ లకు గజిటెడ్ హొదా ఇచ్చినచో తెలంగాణ ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదు అని తెలియజేయడం జరిగింది అయినప్పటికీ రెండవ పిఆర్సి కమిషన్ వద్దకు ఎసిటిఓ గెజిటెడ్ హొదా ఫైల్ను పంపించగ ఆర్థిక శాఖ ఖజానాపై ఎటువంటి భారం పడదు అని చెప్పటం జరిగింది తెలంగాణ జే ఏడి సర్వీసెస్ కూడా ఏ సిటీవో లకు గజిటెడ్ హొదా వెంటనే ఇవ్వండి అని తెలియజేయడం జరిగింది అయినప్పటికీ ఇప్పటివరకు ఏ సి టి ఓ లకు గెజిటెడ్ హొదా దక్కకపోవటం చాలా విచిత్రం ఇదే ఏ సి టి ఓ లకు ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో గజిటెడ్ హొదా ఇచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నాయి కానీ తెలంగాణ రాష్ట్రంలో ఏ సి టి ఓ లకు ఎందుకు గజిటెడ్ హొదా ఎందుకు ఇవ్వడం లేదో అర్థమవ్వటం లేదు మూడుసార్లు శాసనసభలో మజిలీస్ పార్టీ శాసన పక్ష నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ ఈ విషయంపై మాట్లాడటం జరిగింది ఇప్పటివరకు కదలిక లేదు మళ్లీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్కు లేఖ రాయగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ గ్రూప్ టు హొదాలో ఎస్ టి ఓ డిప్యూ టీ తాసిల్దార్ కోపరేటివ్ రిజిస్టర్ సబ్ రిజిస్టార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఇలాంటి వారికి గ్రూప్ టూ లో తక్కువ మార్కులు వచ్చినవారు గజిటెడ్ అధికారులుగా ఆయా శాఖలలో కొనసాగుతున్నారు కానీ గ్రూప్-2 లో మొదటి స్థానం ఎక్కువ మార్కులు వచ్చిన వారిని వాణిజ్య పనుల శాఖలో ఏ సి టి ఓ పోస్ట్ ఇవ్వటం జరుగుతుంది గ్రూప్2లో ఏ సి టి ఓ తప్ప మిగిలిన గ్రూప్2లో ఉన్న అధికారులందరూ ఆయా శాఖలను గజిటెడ్ హొదాలో కొనసాగుతున్నారు కానీ వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న ఏసిటిఓ లకు ఇప్పటివరకు దాదాపు 8 సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పక్షాన ఎన్నో రెప్రెసెంటేషాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారం కాకపోవటం చాలా బాధాకరమైన విషయమని తెలంగాణ వాణిజ్య పనుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు

# జగన్ అవినీతి, నిర్లక్ష్యాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నా

## సెకీ ఒప్పందాలపై ఏసీబీకి ఫిర్యాదు చేస్తాం - పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటన

**అమరావతి:** అదానీ ముడుపుల కేసు వ్యవహారంలో మాజీ సీఎం జగన్ పై ఏసీబీకి ఫిర్యాదు చేస్తామని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటన చేశారు. జగన్ అవినీతి, నిర్లక్ష్యాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నట్లు తెలిపారు. తాను పర్సనల్ గా మాట్లాడితే జగన్ ఇంట్లో నుంచి కూడా అడుగు బయటపెట్టరంటూ సీరియస్ కామెంట్స్ చేశారు. అదానీతో చేసిన ఒప్పందాన్ని చంద్రబాబు ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసలు డీల్ రద్దు చేయడానికి చంద్రబాబు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలు అయిందని%ొ% మరి మీ సూపర్ సిక్స్ ఎక్కడ? అని షర్మిల నిలదీశారు. సూపర్ సిక్స్ పథకాలను కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ ప్రకటన చేసే నాటికి గత సీఎం జగన్ 8 లక్షల కోట్లు అప్పులు చేసి పెట్టారని%ొ%ఈ విషయం చంద్రబాబు కి తెలుసన్నారు."రైతుకి 20 వేల ఆర్థిక సహాయం అన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు అన్నారు.. ఎప్పుడు ఇస్తారో తెలియదు. 20 లక్షల ఉద్యోగాల విషయంలో ఎప్పుడు కల్పిస్తారు.. టైమ్ బాండ్ అంటూ ఏమీ లేదు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అన్ని 15 వేలు ఇస్తా అన్నారు.. ఈ ఏడాది గడిచి పోయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదు" అని విమర్శలు గుప్పించారు.అదానీ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 1750 కోట్లు ముడుపులు తీసుకున్నారని షర్మిల చెప్పారు."ఈ అంశంపై అమెరికా కోర్టుల్లో కేసు నమోదు అయింది. ఇంత జరిగినా కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు లేవు. చంద్రబాబు.. అదానీ పేరు కూడా ఎత్తడం లేదు. జగన్ కి చంద్రబాబు కి ఏమిటి తేడా ? జగన్.. రాష్ట్రాన్ని సొంత ప్రయోజనాల కోసం తాకట్టుపెట్టాడు. నా పేరు లేదు అని జగన్ అతి తెలివిగా మాట్లాడాడు. అప్పుడు చీఫ్ మినిస్టర్ అంటే జగన్ కాదా ? మీది అతి తెలివినా? వెర్రితనమా ? రాష్ట్రానికి 25 ఏళ్లు అదానీ పవర్ ఒక భారంపక్క రాష్ట్రాల్లో 1.99 పైసలు అమ్ముతుంటే...ఇక్కడ 2.49 పైసలు ఎక్కువ పెట్టీ ఎందుకు కొన్నారు?" అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. "జగన్ గారు ఎందుకు 25 ఏళ్లకు అదానీ తో




ఒప్పందం చేశారు..? టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదానీ డీల్ పెద్ద కుంభకోణం అని ఆందోళన చేసింది. కోర్టు లో కూడా కేసులు వేసింది. పెద్ద ఎత్తున ముడుపులు అందాయని పయ్యావుల కేశవ్ ఆరోపణలు చేశాడు. మరి మీరు అధికారంలో ఉన్నారు. ఈ విషయం పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు ? అన్ని ఆధారాలు దగ్గర పెట్టుకొని ఎందుకు మౌనంగా ఉన్నారు ? మీరు జగన్ చేసిన డీల్స్ రద్దు చేయలేదు అంటే... అవి సక్రమం అని ఒప్పుకుంటారా ? లేక అదానీ కి చంద్రబాబు బయపడుతున్నారా?" అని షర్మిల నిలదీశారు. వైసీపీ నేతల వ్యాఖ్యలకు షర్మిల కౌంటర్ ఇచ్చారు. తాను మాట్లాడేది పర్సనల్ కాదని చెప్పుకొచ్చారు. "నేను పర్సనల్ మాట్లాడితే జగన్ ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టడు. మీరు మొత్తం రాష్ట్రాన్ని దోచేశారు. రుషికొండను లేకుండా చేశారు. మీ నిర్లక్ష్యాన్ని, అవినీతిని మాత్రమే నేను ప్రశ్నించాయ 1750 కోట్ల ముడుపులు అడిగితే పర్సనల్ అవుతుందా ? వివేకా హత్య మీద మాట్లాడితే పర్సనల్ ఎలా అవుతుంది. గంగవరం పోర్టు అమ్మేశారు అంటే పర్సనల్ అవుతుందా ? సోషల్ మీడియా లో సైతాన్ సైన్యం గురించి మాట్లాడితే పర్సనల్ అవుతుందా?"దీనికి వైసీపీ నేతల సమాధానం చెప్పాలి. జగన్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఏపీసీసీ అధ్యక్షురాలుగా%ొ% ప్రభుత్వం, నేతల వైఫల్యాలను ఎత్తి చూపడం తన విధి అని కామెంట్స్ చేశారు. ఇది కూడా పర్సనల్ అని అంటే... ఎలా ? అని వ్యాఖ్యానించారు.

# పోలవరం భూసేకరణ, పునరావాసం బకాయిలు విడుదల

## భూసేకరణల కోసం ప్రభుత్వం రూ. 996 కోట్లను విడుదల - డిసెంబర్ రెండో వారంలో చంద్రబాబు పర్యటన

**అమరావతి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన పునరావాసం, పరిహారం, భూసేకరణల కోసం ప్రభుత్వం రూ. 996 కోట్లను విడుదల చేసింది. 2026నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ఒక యజ్ఞంలా, 2027 నాటికి నిర్మాణం పూర్తి చేసేలా సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు మంత్రి నిమ్మల తెలిపారు. డిసెంబర్ రెండోవారంలో ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. అదేరోజు పోలవరం నిర్మాణానికి సంబంధించిన టైమ్ షెడ్యూల్ ను కూడా విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఒక రోజు గానీ, ఒక గంట గానీ వృథా కాకూడదని సీఎం చెప్పారని మంత్రి వివరించారు. 10 రోజుల్లో మరింత క్లారిటీ తీసుకుని షెడ్యూల్ తయారు చేయడం జరుగుతుందన్నారు.పోలవరం ఆర్ అండ్ ఆర్, భూసేకరణకు సంబంధించిన రూ.996 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేసేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. గత ప్రభుత్వ పాలనలో పోలవరం ప్రాజెక్టు 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని మంత్రి వివరించారు. పోలవరం విషయంలో అంతర్రాష్ట్ర సమస్యలకు సంబంధించి చత్తీస్ ఘడ్, ఒడిశా రాష్ట్రాలతో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని కచ్చితంగా పోలవరం ఫలాలు రాయలసీమ, ఉత్తరాంధ్రలకు కూడా అందిస్తామన్నారు. రాయలసీమకు లైఫ్ లైన్ వంటి హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.5 కూడా కేటాయించలేదని ఆరోపించారు. హంద్రీ-నీవాను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించేందు కు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ నెలలో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాల్వ విస్తరణ, లైనింగ్ పనులు మొదలుపెడతామన్నారు. డిసెంబర్-జనవరి నెలల్లో హంద్రీ-నీవా పనులు ప్రారంభిస్తారు.4 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించే బహుళార్థక ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ కు రూ.73 కోట్ల పెనాల్టీ విధించారని గుర్తు చేశారు. 3 నెలల్లో అనుమతులు తీసుకోవాలని చెప్పినా, పట్టించుకోకపోవడంతో 3 సంవత్సరాలు ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో చింతలపూడి ప్రాజెక్టును ప్రశ్నార్థకం చేసేశారన్నారు.ప్రాజెక్టుల విషయంలో గత ఐదేళ్లు పాలకులు మొద్దు నిద్రపోయారని, అవాస్తవాలు-అసత్యాలు వెల్లడించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు,

ఎమ్మెల్యేలు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించి వాస్తవ పరిస్థితిని సమీక్షించారని, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి తీసుకొచ్చారన్నారు. 2024 ఎన్నికల సమయంలో రైతులను కూడా దగ్గరకు రానీయకుండా ప్రాజెక్టును అంకితం చేస్తున్నామని అసత్య ప్రచారాలు చేశారన్నారు. 2026 జూన్ కల్లా వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు తీసుకొచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలకు పెద్దపీట వేసేలా.. ప్రతి ఎకరాకు నీళ్లిచ్చేలా, ప్రతి గ్రామానికీ తాగునీరందించేలా వాటర్ పాలసీ తీసుకురావడం జరుగుతోం దన్నారు. ఇటీవల వర్షాలు, వరదలు వచ్చినప్పుడు 11 వేల టీఎంసీలు నీళ్లు రాష్ట్రానికి వచ్చినా వాటిలో 954 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలన్నా లక్ష్యంతో.. వరదలొచ్చినా, కరువు కాటకాలొచ్చినా రాష్ట్రాన్ని కాపాడాలన్న ముందుచూపుతో వాటర్ పాలసీ తీసుకురావడం జరుగుతోందన్నారు.ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా .. సవాళ్లెన్ని ఎదురైనా గోదావరి - కృష్ణా - పెన్నా నదుల అనుసంధానం పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారని గోదావరి - కృష్ణా - బనకచర్ల ప్రాజెక్టు ఇదొక గేమ్ ఛేంజర్ అని స్పష్టం చేశారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న వరద జలాలను మళ్లించి ప్రతి ఎకరాకూ సాగునీరందించాలంటే నదుల అనుసంధానం జరగాల్సిందేనన్నారు. రాష్ట్రం రూపు రేఖలు మార్చే నదుల అనుసంధానాన్ని 2-3 ఏజెన్సీలతో తక్కువ ఖర్చుతో చేపట్టేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

### నిధుల దుర్వినియోగంపై

# ఏపీ సీఐడీ మాజీ చీఫ్ పై సస్పెన్షన్ వేటు

**అమరావతి:** ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌పై వేటు పడింది. నిధుల మళ్లింపుతో పాటు అధికార దుర్వినియోగం అభియోగాలపై సంజయ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సర్వీసు నిబంధనల ఉల్లంఘించినందుకు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సంజయ్ పదవిలో ఉండగా టెండర్లు లేకుండా ల్యాప్‌టాప్‌లు, ఐపాడ్‌లు కొనుగోలు చేశారని, అగ్నిమాపకశాఖ డీజీగా ఉన్నప్పుడు నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనని సస్పెండ్ చేసిన ప్రభుత్వం, విచారణ పూర్తయ్యే వరకు విజయవాడ వదిలి వెళ్లవద్దని సంజయ్‌కు ఆదేశాలు జారీ చేసింది. అఖిలభారత సర్వీసుల నియమావళిలోని 3 (1) సెక్షన్ ప్రకారం ఈ సస్పెన్షన్ విధించింది. అనుమతి లేకుండా ఆయన విజయవాడ విడిచి వెళ్లకూడదని ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్కుమార్ ప్రసాద్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. సీఐడీ అదనపు డీజీగా, ఏపీ విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖలో డీజీగా సంజయ్ పనిచేశారు. విధుల్లో ఉండగా ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అఖిల భారత సర్వీసుల క్రమశిక్షణ, రూల్ 1969లోని నిబంధన3(1) కింద సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక శాఖలో డీజీగా ఉండగా టెండర్ల ప్రక్రియలో అక్రమాలతో పాటు నిబంధనల అమలులో అవకతవకలకు పాల్పడినట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. అగ్ని పోర్టల్లో ఎన్వోసీలను జారీ చేయడం, హార్డ్ వేర్ సరఫరా కోసం రూ.2.29కోట్ల ఒప్పందాన్ని సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు.

# వెలగపూడిలో చంద్రబాబు సొంతిల్లు

## ఐదు ఎకరాల హౌసింగ్ ఫ్లాట్ కొనుగోలు చేసిన సీఎం

**అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నివాస చిరునామా త్వరలో మారనుంది. పదేళ్లుగా విపక్షాల విమర్శలకు చెక్ పెట్టేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజధాని కోర్ క్యాపిటల్ ఏరియాలో ప్రస్తుత వెలగపూడి గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని కొనుగోలు చేశారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఏపీ రాజధానిలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోనున్నారు. దాదాపు పదేళ్లుగా ఉండవల్లి గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. లింగమనేని రమేష్‌కు చెందిన గెస్ట్‌హౌస్‌ను లీజుకు తీసుకుని అందులో నివాసం ఉంటున్నారు. 2015 నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడే ఉంటున్నారు. కృష్ణానది కరకట్ట లోపల ఉన్న ఈ నివాసంపై వైసీపీ పలుమార్లు విమర్శలు గుప్పించింది. చంద్రబాబు అక్రమ నిర్మాణంలో ఉంటున్నారని, వరదల సమయంలో చంద్రబాబు నివాసం ముంపుకు గురవుతుందని ఆరోపణలు చేసేవారు.చంద్రబాబు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి చుట్టూ రాజకీయ వివాదాలు నెలకొనడంతో వాటన్నింటికి ముగింపు పలకాలని టీడీపీ అధినేత నిర్ణయం కృష్ణా నది ఒడ్డున ఉన్న నివాసం నుంచి షిఫ్ట్ కానున్నారు. ఉండవల్లి కరకట్ట మార్గంలోని లింగమనేని రమేష్ చెందిన గెస్ట్‌హౌస్ స్థానంలో రాజధానిలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. అమరావతిపై అన్ని వర్గాల్లో భరోసా కల్పించే క్రమంలో అక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. కోర్ క్యాపిటల్ నిర్మాణానికి సంబంధించి రూ.11వేల కోట్లతో పనుల్ని చేపట్టడానికి ఇటీవల అమోద ముద్ర వేశారు. వచ్చే ఏడాది కల్లా వీటిలో చాలా నిర్మాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ నేపథ్యంలో రాజధానిలో శాశ్వత నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు చంద్రబాబు స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత వెలగపూడి రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న స్థలాన్ని చంద్రబాబు కుటుంబం కొనుగోలు చేసింది. దాదాపు 25 వేల చదరపు గజాల ఈ ప్లాట్ ఈ-6 రోడ్డులో ఉంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైతుల పేరిట ఉన్న భూమిని చంద్రబాబు కొనుగోలు చేశారు. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా ప్రభుత్వానికి వ్యవసాయ భూములు స్వాధీనం చేసినందుకు గాను వారికి రిటర్నబుల్ ప్లాట్ కేటాయించారు. ముఖ్యమంత్రి నివాసానికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఆ స్థలాన్ని చంద్రబాబు నివాసం కోసం ఎంపిక చేశారు. సొంతింటి నిర్మాణం కోసం భూమి యజమానులతో సంప్రదింపులు జరిపి వారికి డబ్బులు చెల్లించినట్లు తెలుస్తోంది.దాదాపు ఐదున్నర ఎకరాల ఈ భూమికి నాలుగు వైపులా రోడ్డు ఉంది. రాజధానిలో కీలకమైన సీడ్ యాక్సెస్ మార్గం కూడా ఈ భూమి పక్క నుంచి వెళుతుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారులు, ఎన్జీవోల నివాస సముదాయాలు, న్యాయమూర్తుల బంగ్లాలు, తాత్కాలిక హైకోర్టు, విట్, అమరావతి గవర్న మెంట్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలు చంద్రబాబు నివాసానికి రెండు కి. మీ. పరిధిలో ఉంటాయి. దాదాపు ఐదున్నర ఎకరాల్లో ఉన్న భూమిలో ఇంటి నిర్మాణం చేపడతారు. ప్రస్తుతం చంద్రబాబు కొనుగోలు చేసిన ఇంటి స్థలంలో భూమి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటితో పాటు పార్కింగ్, సిబ్బంది కోసం ఏర్పాట్లు చేస్తారు. వీలైనంత త్వరలో వెలగపూడిలో చంద్రబాబు ఇంటి నిర్మాణం మొదలయ్యే అవకాశం ఉంది. అమరావతి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి అటంకాలు ఎదురు కాకుండా ఉండేలా రాజధానికి రూపురేఖలు ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నారు. చంద్రబాబు స్వయంగా ఇంటిని నిర్మించుకుంటే మరికొందరు కూడా ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.2019లో ప్రభుత్వం మారక ముందే పలువురు ప్రముఖులు అమరావతిలో ఫ్లాట్లు కొనుగోలు చేశారు. రైతుల వాటాగా దక్కిన ఫ్లాట్లకు భారీ ధరలు లభించాయి. 2019లోనే చదరపు గజం 40-45వేల వరకు ధర పలికింది. తాజాగా చంద్రబాబు ఇంటి స్థలం కొనుగోలు నిర్ణయంతో అమరావతి రియల్ ఎస్టేట్‌కు ఊపు వస్తుంది. మరోవైపు హ్యాపీనెస్ట్ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 1200 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తారు.

# కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు

## చరిత్ర చెరిపేస్తున్నారంటూ సీఎంపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్:**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ తల్లిని మూర్తీభవించిన స్త్రీగా రూపొందించారని.. ఆయనపై కోపంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చరిత్రను చెరిపేసేందుకు యత్నిస్తున్నారంటూ మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్టించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయి అధికారంలోకి రాగానే మార్చలేదని గుర్తు చేశారు. 'దేశంలో ఎన్నో చోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కోపంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు.' అంటూ కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. సింహాలు తమ గాథ



చెప్పుకోకపోతే.. వేటగాళ్లు చెప్పే పిట్ట కథలే చరిత్రగా నిలిచిపోతాయనేది అక్షర సత్యమని కేటీఆర్ అన్నారు. 'యుద్ధంలో గెలిచిన వాడే పరాజితుల చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తుంటారు. ఇదే తెలంగాణలో జరుగుతుంది. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం గురించి సీఎంకు ఒక్క మాట రాదు. శ్వేతసౌధం లాంటి అంబేడ్కర్ సచివాలయం గురించి ఒక్క మాట రాదు. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ గురించి ఒక్క మాట రాదు. ఈ పదేళ్లలో జరిగిన నిర్మాణాల గురించి సీఎంకు ఒక్క మాట రాదు. ఎందుకంటే పరాజితుల చరిత్రను చెరిపేయాలనే మూర?పు నాయకులు ఉన్నారు. ఈ సీఎం తెలంగాణ తల్లి విగ్రహాన్ని పేదరికానికి, సమస్యలకు చిహ్నంగా ప్రతిష్టించాలని అనుకుంటున్నారు. కేసీఆర్ చేసిన పోరాటాన్ని రూపుమాపుతా అంటున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు.' అని కేటీఆర్ అన్నారు. తమ పదేళ్ల పాలనలో బతుకమ్మ, బోనాల పండుగలను రాష్ట్ర పండుగలుగా జరుపుకొన్నామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక మన చరిత్రను ఎలుగెత్తి చాటుకునే ప్రయత్నం చేశామని.. తాము పార్టీ నాయకుల పేర్లు పెట్టి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదని అన్నారు.

తెలంగాణ చరిత్ర శాశ్వతంగా నిలవాలనే ప్రయత్నంతో.. కవులు, కళాకారులకు, సాహితీవేత్తలకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ఆయా ప్రాంతాల దేవుళ్ల పేర్లు పెట్టామన్నారు. కార్యక్షేత్రంలో ప్రతి రోజూ కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతోన్న బీఆర్ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. మరో నాలుగేళ్లు ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ రోజు తెలంగాణ భవన్ జనతా గ్యారేజీగా మారిందని.. హైడ్రా, మూసీ బాధితులతో పాటు పలువురు క్యూ కడుతున్నారని చెప్పారు.

# బొటానికల్ గార్డెన్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టు

## 75 రకాల థీమ్ పార్కులు ఏర్పాటు .. ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన %-% ప్రజా విజయోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో పలు ఎకో టూరిజం ప్రాజెక్టులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దీంతో పాటు బొటానికల్ థీమ్ పార్కులు, వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ, ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ప్రకృతి అందాలు చెంతకు తెచ్చే అద్భుతమైన వృక్ష పరిచయ కేంద్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అదే విధంగా అటవీ పర్యావరణహిత అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఎలక్ట్రికల్ వాహనంలో సందర్శించిన సీఎంలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన %-% ప్రజా విజయోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో పలు ఎకో టూరిజం ప్రాజెక్టులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దీంతో పాటు బొటానికల్ థీమ్ పార్కులు, వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ, ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ప్రకృతి అందాలు చెంతకు తెచ్చే అద్భుతమైన వృక్ష పరిచయ కేంద్రాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అదే విధంగా అటవీ పర్యావరణహిత అభివృద్ధి కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం, పాల్వంచ డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్‌ను వర్చువల్‌గా సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ విజయలక్ష్మి, కోదండరెడ్డి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. బొటానికల్ గార్డెన్ వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ, పలువురు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. బొటానికల్ గార్డెన్‌ను సందర్శించేందుకు వచ్చిన పాఠశాల విద్యార్థులను సీఎం పలకరించి కరచాలనం చేశారు.దేశంలో తొలిసారిగా సందర్శకులు, విద్యార్థులను ఆకర్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన పర్యావరణహిత వృక్ష పరిచయ క్షేత్రంలో 75 రకాల థీమ్ పార్కులు ఏర్పాటు చేశారు. ఈ వృక్ష పరిచయ క్షేత్రంలో సీతాకోక చిలుక వనం, బతుకమ్మ వనం, నౌక వనం, రంగు రంగుల ఆకుల వనం, సూచిక వనం థీమ్ పార్కులు ఆకట్టుకున్నాయి.మద్దివనం, సౌందర్య వనం, అక్షర వనం, వంటింటి వనం, పచ్చి ఎరువుల వనం, అల్ఫా బీట్ వనం, భోజపత్ర వనం థీమ్ పార్కులు చూడముచ్చటగా ఉన్నాయి. మనం నిత్య జీవితంలో మనం ఉపయోగించేవి కావడం ప్రత్యేకత ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్వయంగా వృక్ష పరిచయ క్షేత్రంలో ఎలక్ట్రికల్ వాహనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరగడంతో పాటు వృక్ష పరిచయ క్రేత్రంలో థీమ్ పార్కులు సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు.

# హామీల అమలుపై కాంగ్రెస్‌ను వెంటాడుతాం

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళల కు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఇవ్వడం లేదు. రూ.2 వేలు పింఛన్ పెంచామని చెప్పారు, కానీ పెంచలేదు. ఆ బాకీని మనం వసూలు చేయాలా? వద్దా? అని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి అర్పించినవాళ్లవుతారని స్పష్టం చేశారు. తెలంగాణతల్లి రూపురేఖల మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిమళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు.

**రేవంత్‌రెడ్డికి కవిత సవాల్**

పేగులు మెడల వేసుకుంటా అంటూ వ్యాఖ్యలు చేసే సీఎం రేవంత్‌రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే నాగార్జునసాగర్ వద్ద మోహరించిన కేంద్ర బలగాలను వెనకి పంపించి, మన నీళ్లు మనకు తీసుకురావాలని కవిత సవాల్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, ఇప్పుడు అకడ కేంద్ర బలగాలు మోహరించాయని చెప్పారు. కృష్ణ జలాలను ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుంటే రేవంత్ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**కేసులకు భయపడే రకం కాదు**

రాజకీయాల్లో ఉండటం, కేసీఆర్ కూతురు కావటం వల్లే కేంద్ర ప్రభుత్వం తనపై తప్పుడు కేసులు పెట్టి ఐదున్నర నెలలు జైలుపాలు చేసిందని కవిత ఆవేదన వ్యక్తంచేశారు. ఏ తప్పూచేయని మనం ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. ఈ ఏడాది మొదట్లోనే తెలంగాణ జాగృతి మొదలుపెట్టిన బీసీ రిజర్వేషన్ల కార్యాచరణ కొనసాగిస్తూనే ఉన్నాం. మన కార్యక్రమం కొనసాగాల్సిందే. అని చెప్పారు. ప్రజా జాగృతమే కర్తవ్యంగా ప్రయాణం తెలంగాణ జాగృతి ప్రజాచైతన్యాన్ని ఎప్పుడూ విస్మరించలేదని కవిత తెలిపారు. మహిళా రిజర్వేషన్ల సాధన కోసం అనేక సదస్సులు నిర్వహించి, కేంద్రం బిల్లు పెట్టడం, ఆమోదం తెలపడంలో జాగృతి చేసిన పోరాటం ఇమిడి ఉందని తెలిపారు. తెలంగాణ జాగృతి ఏర్పాటుకు స్ఫూర్తి కేసీఆర్ అయితే, మార్గదర్శనం జయశంకర్ సార్ అని కవిత వివరించారు. విజయాల స్ఫూర్తిని కొనసాగిస్తుందని స్పష్టంచేశారు. హాస్టల్ పిల్లలకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## వచ్చే ఏడాది నుంచి పెద్ద ఎత్తున

# సాంస్కృతిక కార్యక్రమాలు

**హైదరాబాద్:** ప్రతి ఏడాది దీక్షా దివస్ సందర్భంగా నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు విస్తృతంగా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ లిటరేచర్ ఫెస్టివల్‌ను హైదరాబాద్ సహా పాత జిల్లాల కేంద్రంగా నిర్వహిస్తాం. సాహిత్య కార్యక్రమాలు, పుస్తకావిష్కరణలు చేసుకుందామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సంస్కృతి, భాషపరంగా తెలంగాణ ఔన్నత్యాన్ని చెప్పుకునే విషయంలో కొంతమేర సఫలం అయ్యాం. బతుకమ్మ, బోనాల పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా జరుపుకున్నాం. తెలంగాణ చరిత్రను, ఉద్యమకారులను సిలబస్‌లో పెట్టుకున్నాం. అదే మాదిరిగా యూనివర్సిటీలకు గొప్ప నాయకులు పేర్లు పెట్టుకున్నాం. పీవీ నరసింహారావు, ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి గొప్ప మేధావుల పేర్లు పెట్టుకున్నాం. కొత్త జిల్లాలకు కూడా ఉద్యమకారుల పేర్లు పెట్టుకున్నాం.. అలా తెలంగాణ చరిత్రను వెలుగెత్తే చాటే ప్రయత్నం చేశామని కేటీఆర్ తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలు కేసీఆర్ నాయకత్వంలో మూడు రోజులు ఘనంగా నిర్వహించాం. రచయితలు, కవులను ఘనంగా సన్మానించుకున్నాం. సాంస్కృతిక సారథి పెట్టి రసమయి బాలకిషన్‌ను చైర్మన్‌గా నియమించి, 500 మంది కళాకారులకు ప్రభుత్వ కొలువులు ఇచ్చాం. ప్రాజెక్టులు కట్టుకుంటే.. ఆయా ప్రాంతంలో ఉండే దేవుళ్ల పేర్లు పెట్టుకున్నాం. కానీ మన పార్టీ నాయకుల పేర్లు పెట్టుకునే ప్రయత్నాలు జరగలేదు. మన డబ్బా మనమే కొట్టుకునే ప్రయత్నం జరగలేదు. ప్రాంతం శాశ్వతం.. అధికారం శాశ్వతం కాదు. తెలంగాణ శాశ్వతం కాబట్టి తెలంగాణ చరిత్ర శాశ్వతంగా గొప్పగా నిలవాలని ఈ ప్రయత్నం చేశాం. కేసీఆర్ పేర్ల మీద ఎలాంటి కార్యక్రమాలు చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాళోజీ కళాక్షేత్రం వరంగల్‌లో కట్టినా.. ఇతర జిల్లాల్లో కాళోజీ కళాభారతి పేరిట నిర్మించాం. సాహితీవేత్తలకు, రచయితలకు పెద్దపీట వేశారు కేసీఆర్. గ్రంథాలయాలు కొత్తవి ఎన్నో ప్రారంభించుకున్నాం. ఇంకా జరగాలి అని తెలంగాణ సమాజం కోరుకుంటుంది అని కేటీఆర్ తెలిపారు.

**గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల**

# నిరోధక చట్టం పటిష్టం : సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ:** గూండా, సామాజిక వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కఠినంగా ఉందని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 2023 మేలో గూండా చట్టం కింద పెండిరగ్‌లో ఉన్న విచారణలను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషన్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. విచారణకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ పిటిషన్ గతేడాది నవంబర్‌లో సుప్రీంకోర్టు యూపీ ప్రభుత్వ స్పందన కోరింది. దీంతో గ్యాంగ్‌స్టర్ చట్టం కింద పిటిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు స్టే విధించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాదులు గౌరవ్ అగర్వాల్, తన్వి దూబే వాదనలు వినిపించారు. యూపీ గ్యాంగ్‌స్టర్ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఎఫ్ఐఆర్ నిరాధారమని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ ఆరోపించారు. పిటిషనర్‌పై గ్యాంగ్‌స్టర్ల చట్టాన్ని వర్తింపజేయడం పక్షపాతంతో కూడుకున్నదని, ఇది పోలీసు, న్యాయ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. బుధవారం పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తొలుత 1986 చట్టంలోని సెక్షన్ల కింద అక్రమ మైనింగ్ కేసు నమోదు చేశారని.. ఒకే అభియోగంపై రెండుసార్లు కేసు నమోదైందన్నారు. గూండా చట్టాన్ని విమర్శించిన ధర్మాసనం దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ చట్టంలోని కొన్ని నిబంధనల రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌ను కూడా కోర్టు విచారిస్తుందని ధర్మాసనం తెలిపింది. అంతకుముందు హైకోర్టులో పిటిషనర్ తరఫు న్యాయవాది గ్యాంగ్‌స్టర్ చట్టం కింద నమోదైన కేసులో తనను ఇరికించారని వాదనలు వినిపించారు. పిటిషనర్ పేరు లేని మరో కేసు ఆధారంగానే గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.

## పలు వాహనాలను ఢీకొట్టి హల్‌చల్

### ప్రమాదంలో ముగ్గురికి గాయాలు.. వాహనాలు ధ్వంసం

హైదరాబాద్: ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా కారును నడుపుతూ పలు వాహనాలను ఢీకొట్టి హల్?చల్? చేసిన ఘటన హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో మల్లెపల్లి అన్వర్ ఉలూమ్ కళాశాల వద్ద టయోటా వాహనదారుడు ర్యాష్ డ్రైవింగ్? చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేశాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా నాలుగైదు వాహనాలు ధ్వంసమయ్యాయి. అక్కడున్న ప్రజలు చూస్తుండగానే కారు రివర్స్ తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ప్రస్తుతం ఈ ఘటన సీసీటీవీ కెమెరాలో రికార్డు కాగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి

### గవర్నర్‌ను కోరిన ఫడ్నవీస్ బృందం

ముంబై, డిసెంబర్ 4 (ఆర్‌ఎన్‌ఎ): మహారాష్ట్రలో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడి 11 రోజులైనా సీఎం ఎంపికపై పీటముడి వీడకపోవడంతో సస్పెన్స్ కొనసాగింది. చివరకు సీఎం ఎంపికపై మహాయుతి కూటమిలోని మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బుధవారం ఉదయం బీజేపీ శాసనసభాపక్షం సమావేశమై దేవేంద్ర ఫడ్నవీస్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంది. మధ్యాహ్నం దేవేంద్ర ఫడ్నవీస్.. కూటమిలోని శివసేన పార్టీ అధ్యక్షుడు ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్‌లతో కలిసి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి తమను ప్రభుత్వ ఏర్పాటు ఆహ్వానించాలని కోరారు. తమకు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన బలం ఉన్నదని చెప్పారు. కాగా దేవేంద్ర ఫడ్నవీస్ రేపు (నవంబర్ 4న) సాయంత్రం దక్షిణ ముంబైలోని అజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఇద్దరూ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, వివిధ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు తదితరులు హాజరుకానున్నారు.

## సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం

### గోల్డెన్ టెంపుల్ వద్ద కాల్పులు

### భద్రతా సిబ్బంది అప్రమత్తతతో తృటిలో తప్పిన ప్రాణాపాయం

**గుర్దాస్‌పుర్:** పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి, శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్‌పై కాల్పులు జరిగాయి. మతపరమైన శిక్ష అనుభవించేందుకు స్వర్ణ మందిర్ చేరుకున్న సమయంలో ఓ దుండగుడు బాదల్‌పై కాల్పులు జరిపాడు. పక్కన నిలుచున్న భద్రతా సిబ్బంది అప్రమత్తతతో తృటిలో బాదల్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిందితుడికి ఖలిస్థాన్ ఉగ్రముఠాతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శిక్షలో భాగంగా స్వర్ణ దేవాలయ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై కూర్చొని సేవాదార్ (కాపలాదారుడు)గా ఉండగా ఓ వృద్ధుడు ఆయన దగ్గరకు వచ్చాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉన్న అతడు ప్యాంట్ జేబులోంచి తుపాకీ తీసి సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. ఇంతలోనే సుఖ్‌బీర్ పక్కన నిలుచున్న భద్రతా సిబ్బంది దుండగుడి అనుమానాస్పద కదలికలను పసిగట్టారు. తుపాకీ తీసి కాల్చే లోపే దుండగుడిని పక్కకు తోసేశారు. దీంతో తుపాకీ గురితప్పి ఆ తూటా సుఖ్‌బీర్ పక్కనున్న గోడకు తగిలింది. దీంతో సుఖ్‌బీర్‌కు ఎలాంటి హాని జరగలేదు. సుఖ్‌బీర్‌పై కాల్పులు జరిపిన నిందితుడిని వెంటనే బంధించారు. గుర్దాస్‌పుర్ జిల్లాకు చెందిన నరేన్ సింగ్‌గా గుర్తించారు. అతడికి ఖలిస్థానీ ఉగ్రముఠా బబ్బర్ ఖల్సాతో సంబంధాలున్నట్లు పోలీసులు తెలిపారు. 2004లో బురేల్ జైల్-బ్రేక్ కేసులో ఇతడి హస్తం ఉందని, ఆ ఘటనలో నలుగురు బబ్బర్‌ఖల్సా ముఠా సభ్యులు జైలు నుంచి తప్పించుకున్నారని వెల్లడిరచారు. బుధవారం దాడిని ఆపింది రిష్‌పాల్ సింగ్, జస్బీర్‌సింగ్, పర్మీందర్ సింగ్ అనే పోలీసులని అమృత్‌సర్ సీపీ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ తెలిపారు. సకాలంలో వారు అప్రమత్తమయ్యారని అభినందించారు. మత విశ్వాసాల కారణంగా స్వర్ణమందిర్ ప్రాంగణంలో పోలీసులను యూనిఫాంలో మోహరించేందుకు అనుమతి లేదని సీపీ వివరించారు. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుఖ్?బీర్ సింగ్ బాదల్ సహా ఆయన అనుచరులు 2007-2017 మధ్య అధికారంలో ఉన్న సమయంలో తప్పులు, మతపరమైన దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఆగస్టులో అకాల్ తఖ్త్ తేల్చింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చింది. సేవకుడిగా అమృత్‌సర్?లోని స్వర్ణదేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని ఆదేశించింది. మంగళవారం తొలిరోజు ఆ శిక్షను సుఖ్‌బీర్ అనుభవించారు. రెండోరోజు శిక్ష అనుభవించేందుకు స్వర్ణమందిర్ వెళ్లారు. మెడలో తప్పు చేసినట్లు రాసి ఉన్న పలకను ధరించి ద్వారం వద్ద కూర్చున్న కొంతసేపటికే ఈ ఘటన జరిగింది.

# రోశయ్యకు పుష్పాంజలి ఘటించిన సీఎం రేవంత్ రెడ్డి

### విగ్రహ ఏర్పాటుకు ర్యలు తీసుకుంటామని హామీ

### నాలుగో వర్ధంతిలోపు విగ్రహ ఏర్పాటు జరగాలని ఆకాంక్ష



**హైదరాబాద్,:** హైదరాబాద్ లో మాజీ సీఎం రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రోశయ్య వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడిరచారు. పలు సందర్భాల్లో రోశయ్య తనను ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కొణిజేటి రోశయ్యకు సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. రోశయ్య 3వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఆర్యవైశ్య ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ లో ఏదైనా మంచి ప్రదేశాన్ని గుర్తిస్తే అక్కడ రోశయ్య విగ్రహ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. నాలుగో వర్ధంతిలోపు విగ్రహ ఏర్పాటు జరగాలని ఆకాంక్షించారు. రోశయ్య వర్ధంతి కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. శాసనమండలి, శాసనసభలో పోటీ పడి స్పీచ్ ఇవ్వాలన్న స్ఫూర్తిని రోశయ్య ఇచ్చారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా రోశయ్య క్రమశిక్షణ పాటించడం వల్లనే 16 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడిరదన్నారు. "చుక్క రామయ్య,ప్రొఫెసర్ నాగేశ్వర్, రోశయ్య లాంటి వారి మధ్య శాసనమండలిలో ఎమ్మెల్సీ గా మాట్లాడేందుకు నేను భయపడ్డాను. నీటి పారుదల శాఖ పైన మండలిలో నేను మాట్లాడినప్పుడు నన్ను తన ఛాంబర్ కు పిలిపించుకొని ప్రోత్సహించారు. ప్రతిపక్ష సభ్యుడినైనప్పటికి మండలి గౌరవం పెంచాలన్న ఉద్దేశంతో రోశయ్య నన్ను ఆనాడు ప్రోత్సహించారు. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు ప్రశ్నించాలి. పాలక పక్షంలో ఉన్నప్పుడు పరిష్కరించాలని రోశయ్య నాకు సూచించారు" అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. చట్టసభల్లో అనాటి స్ఫూర్తి కొరవడిరదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వొద్దన్నట్లుగా పరిస్థితులు తయారయ్యాయన్నారు. "రోశయ్య కుటుంబం రాజకీయాల్లో లేదు. సీఎంగా, గవర్నర్ గా,వివిధ హోదాల్లో 50 యేళ్ల పైగా రాజకీయాల్లో గొప్పగా రాణించారు. తమిళనాడు గవర్నర్ గా ఎవరు వెళ్లినా వివాదాల్లో కూరుకుపోతుంటారు..కాని రోశయ్య అక్కడ వివాదాలు లేకుండా రాణించారు. అనాటి ముఖ్యమంత్రులకు రోశయ్య కుడి భుజం లా వ్యవహరించడం వల్లనే వారు సమర్థంగా పనిచేశారు. రోశయ్య లాంటి సహచరులు ఇప్పుడు లేకపోవడం పెద్ద లోటు. ప్రతిపక్షాల నుంచి వచ్చే ప్రశ్నల నుంచి ప్రభుత్వాన్ని రోశయ్య కంచె వేసి కాపాడే వారు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నెంబర్ 2 స్థానంలో రోశయ్య ఉండాలని ఆ నాటి ముఖ్యమంత్రులు కోరుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి స్థానం కోసం ఏ నాడు రోశయ్య తాపత్రయపడలేదు. రోశయ్య నిబద్ధత కారణంగానే అన్ని హోదాలు ఆయన ఇంటికి వచ్చాయి. సభలో సమస్యలను వ్యూహాత్మకంగా ఎదుర్కోవాలంటే రోశయ్య ఉండాలనే ముద్ర ఆయన బలంగా వేశారు. రాజకీయాల్లో ఆర్య వైశ్యులకు సముచిత స్థానం ఇస్తాం. నేను హైదరాబాద్ వ్యక్తినని గతంలో రోశయ్య స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం" అని స్పష్టం చేశారు.

## సౌత్ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం

### మంగళవారం రాత్రి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్

**సౌత్ కొరియా:** సౌత్ కొరియాలో మంగళవారం ఉన్నట్టుండి ఎమర్జెన్సీ విధించిన ప్రెసిడెంట్ యూన్ సుక్ యోల్ పై అక్కడి ప్రతిపక్షాలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఎమర్జెన్సీ విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ తీర్మానం ప్రవేశపెట్టినట్లు సమాచారం. పార్లమెంట్ లో ప్రతిపక్షానికే మెజారిటీ ఉండడంతో అభిశంసన తీర్మానం నుంచి ప్రెసిడెంట్ యోల్ గట్టెక్కే సూచనలు కనిపించడంలేదని సౌత్ కొరియా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ జరుగుతుందని, ఆ లోపే అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోయే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. మంగళ`వారం రాత్రి టీవీ ప్రత్యక్షప్రసారంలో అధ్యక్షుడు యోల్ సౌత్ కొరియన్లను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్ లో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉండడంతో ప్రభుత్వాన్ని ప్రతీ విషయంలో అడ్డుకుంటున్నాయని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. దాయాది దేశం నార్త్ కొరియాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షాలపై అధ్యక్షుడు తీవ్ర విమర్శలు చేశారు. వారిని కట్టడి చేసి, దేశంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్షల్ లా విధిస్తున్నట్లు ప్రకటించి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే, ఈ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత రావడం, పార్లమెంట్ కూడా వ్యతిరేకించడంతో బుధవారం ఉదయం మార్షల్ లాను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. అంతేకాదు, అధ్యక్షుడిపై పార్లమెంట్ లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానంపై శుక్రవారం పార్లమెంట్ లో ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. అధ్యక్షుడు ఈ తీర్మానం గట్టెక్కాలంటే పార్లమెంట్ సభ్యుల్లో మూడిరట రెండు వంతుల మంది (300 మందిలో 200 మంది ఎంపీలు) ఆయనకు మద్దతుగా ఓటేయాలి. అంతేకాదు, కనీసం ఆరుగురు రాజ్యాంగ న్యాయమూర్తులు కూడా మద్దతు తెలపాలి. అయితే, పార్లమెంట్ లో ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సభ్యులే ఎక్కువగా ఉన్నారు. దీంతో అధ్యక్షుడికి పార్లమెంట్ మద్దతు దక్కడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు.

## నిందితున్ని వలపన్ని పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్:** మాదక ద్రవ్యాల కేసులో ఓ నిందితుడిని అరెస్ట్ చేసేందుకు తెలంగాణ పోలీసులు మహారాష్ట్ర వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ నిందితుడు చేసిన పనులు అచ్చం సినిమాను తలపించాయి. నిందితుడు తప్పించుకునే క్రమంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నిందితుడు పదో అంతస్తు బాల్కనీ నుంచి దూకేందుకు ప్రయత్నించడంతో ఆ ప్రాంతంలో చాలాసేపు ఉత్కంఠ నెలకొంది. తీవ్రంగా శ్రమించి పోలీసులు చివరకు అతడ్ని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన కేసులో మతీన్ ప్రధాన నిందితుడు. ఏడు నెలలుగా పరారీలో ఉన్న మతీన్?, మహారాష్ట్రలోని ఠాణెలో ఉన్నట్లు తెలంగాణ పోలీసులకు సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ వారెంట్ రెడీ చేసుకుని అక్కడికి వెళ్లారు. మహారాష్ట్రలోని స్థానిక కాశీమీరా పోలీస్‌స్టేషన్ సిబ్బంది సహకారంతో మతీన్ కోసం సోమవారం (డిసెంబర్? 02) మీరా రోడ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి ఓ అపార్టుమెంట్‌లోని పదో అంతస్తులో నిందితుడు ఉన్నట్లు తెలుసుకున్నారు. మెల్లగా గుట్టు చప్పుడు కాకుండా అపార్ట్?మెంట్?లోకి ప్రవేశించారు. నిందితుడు నివాసం ఉన్న ఇంటి తలుపు తట్టారు. పోలీసులు తన కోసమే వచ్చారని నిందితుడు మతీన్? విషయాన్ని గ్రహించాడు. ఇక తప్పించుకునే క్రమంలో బాల్కనీలోని గ్రిల్స్ తీసి అక్కడి నుంచి దూకేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడితో మాట్లాడుతూనే స్థానిక అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది బాల్కనీ పక్కన ఓ పెద్ద వల ఏర్పాటు చేశారు. కొందరు పోలీసులు అతడిని మాటల్లో పెట్టి అపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లి పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఠాణె న్యాయస్థానంలో హాజరు పరిచిన అనంతరం హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతాం అని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి పలుమార్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు మాదక ద్రవ్యాల సరఫరాపై నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ డ్రగ్స్ కేసుల్లో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తూనే ఉంది.



# బీచ్‌లో బ్రౌన్ బికినీలో వేదిక..

నటి వేదిక బీచ్ లో బికినీలో ఉన్న ఫొటోలు ఇప్పుడు ఇంటర్నెట్ ను బ్రేక్ చేస్తున్నాయి. ఇటీవల మాల్దీవుల్లో కాల్తై, పరదేశి సహా పలు చిత్రాల్లో నటించేందుకు వెళ్లింది. ఈ బికినీలో ఆమె పర్ఫెక్ట్ ఫిజిక్  చూశారుగా వేదిక బికినీలో ఎలా రెచ్చిపోయి ఫొటోలకు పోజులిచ్చిందో. మాల్దీవ్స్ లో ఆమె హాట్ హాట్ అందాల ఆరబోత   చూశారుగా వేదిక బికినీలో ఎలా రెచ్చిపోయి ఫొటోలకు పోజులిచ్చిందో. మాల్దీవ్స్ లో ఆమె హాట్ హాట్ అందాల ఆరబోత ఇప్పుడు హాట్ టాపిక్ గా మారిపోయింది. తెలుగులో 2007లో వచ్చిన విజయదశమి మూవీతో పరిచయమైన ఈ బ్యూటీ.. ఇప్పుడు తెలుగు, తమిళం, కన్నడల్లో మూడు సినిమాలతో బిజీగా ఉంది. తెలుగులో 2007లో వచ్చిన విజయదశమి మూవీతో పరిచయమైన ఈ బ్యూటీ.. ఇప్పుడు తెలుగు, తమిళం, కన్నడల్లో మూడు సినిమాలతో బిజీగా ఉంది.

చివరిసారి తెలుగులో రజాకార్ మూవీలో కనిపించిన వేదిక.. ఈ మధ్య ఇన్‌స్టాగ్రామ్ లో బోల్డ్ ఫొటోలు పోస్ట్ చేస్తోంది.  చివరిసారి తెలుగులో రజాకార్ మూవీలో కనిపించిన వేదిక.. ఈ మధ్య ఇన్‌స్టాగ్రామ్ లో బోల్డ్ ఫొటోలు పోస్ట్ చేస్తోంది.  వేదిక ప్రస్తుతం తెలుగులో ఫియర్ అనే మూవీ చేస్తోంది. ఇలా గ్లామరస్ ఫొటోలతో తన ఇన్‌స్టాగ్రామ్ లో ఫాలోవర్ల సంఖ్యను పెంచుకుంటోంది. వేదిక ప్రస్తుతం తెలుగులో ఫియర్ అనే మూవీ చేస్తోంది. ఇలా గ్లామరస్ ఫొటోలతో తన ఇన్‌స్టాగ్రామ్ లో ఫాలోవర్ల సంఖ్యను పెంచుకుంటోంది.  బీచ్ లో బికినీలో వేదిక ఉన్న ఫొటోలు చూసి అభిమానులు షాక్ తింటున్నారు. బోల్డ్ కామెంట్స్ చేస్తున్నారు. బీచ్ లో బికినీలో వేదిక ఉన్న ఫొటోలు చూసి అభిమానులు షాక్ తింటున్నారు. బోల్డ్ కామెంట్స్ చేస్తున్నారు.





సోయగం
Soyagam